

సమావేశంలో పాల్గొన్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, కలెక్టర్ వెట్రిసెల్వి

## గృహ వినియోగదారులకు.. నాణ్యమైన విద్యుత్

- అధికారులకు కలెక్టర్ ఆదేశం
- జిల్లా విద్యుత్ కమిటీ సమావేశం

ఏలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వ్యవసాయ, గృహ విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి విద్యుత్‌శాఖాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జిల్లా విద్యుత్ కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. పునరుద్ధరించబడు పంపిణీ రంగ పథకం (ఆర్‌డీఎస్ ఎస్) కింద వ్యవసాయ, వ్యవసాయేతర ఫీడర్ల విభజన, ఓవర్ లోడు ఫీడర్ల విభజన, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు తదితర అంశాలపై విద్యుత్‌శాఖాధికారులతో సమీక్షించారు. వ్యవసాయానికి 9 గంటల పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించాలని, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందించాలన్నారు. ఆర్‌డీఎస్‌ఎస్ కింద రూ.176 కోట్ల వ్యయంతో వ్యవసాయ ఫీడర్ల నుంచి వ్యవసాయేతర సర్వీసులను వేరుచేసే ఫీడర్ల విభజన కార్యక్రమాలు, అదే విధంగా రూ.66.51 కోట్ల వ్యయంతో ఓవర్ లోడ్ ఫీడర్ల విభజన పను లను డిసెంబరులోగా పూర్తి చేసేందుకు నెలవారీ లక్ష్యాలను నిర్దేశిం చుకోవాలన్నారు. హెచ్‌టీ, ఎల్‌టీ, వ్యవసాయ సర్వీసులు, అధిక సామర్థ్యం ఉన్న ట్రాన్స్‌పార్మర్లకు, ఫీడర్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు పనులను నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాలన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్ పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకోవాలని, తమ ప్రాంతం లో చేపట్టిన 11 సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఆర్‌డీఎస్‌ఎస్ కింద కేటాయించిన పనులు తమ నియోజకవర్గంలో త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో తూర్పుప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఎస్ఈ సాల్మన్‌రాజు, ఈఈలు రాధాకృష్ణ, అంబేడ్కర్, శశిధర్, ఖాన్, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

## సీహెచ్‌వోల సమస్యలు పరిష్కరించాలి

### టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి



ధర్నాలో మాట్లాడుతున్న టీచర్స్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ఏలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : నిరవధిక సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఉభయ గోదావరి జిల్లా టీచర్స్ ఎమ్మెల్సీ బి.గోపిమూర్తి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ వద్ద సమ్మె శిబిరాన్ని మంగళవారం సందర్శించి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గోపిమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్షణమే యూనియన్‌తో చర్చలు జరిపి సమస్యను పరిష్కరించి సమ్మె విరమణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. సీహెచ్‌వో, ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలను శాసన మండలిలో లేవనెత్తుతానని హామీ ఇచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు పాల్గొన్నారు.

# రికవరీల్లేవ్..!

## ఏడు సొసైటీల్లో రూ.కోట్లలో గుటకాయ స్వాహా



నేతల దగ్గర పలుకుబడి ఉంటే చాలు. సహకారం మాటున కోట్లు కొల్లగొట్టినా పర్వాలేదు. బినామీల పేరిట రుణ బాగోతాలు నడిపినా తప్పులేదు. రికార్డులు తారుమారు చేసి అందినకాడికి బొక్కేసినా భయం లేదు. అక్రమాలు బయటపడకుండా చేసుకోవచ్చు. విచారణలు ముందుకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు. ఇది జిల్లా సహకార రంగంలో సొసైటీల్లో పనిచేస్తున్న కొందరు కార్యదర్శుల తీరు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని కొన్ని సొసైటీల్లో అక్రమాలు జరిగినట్లు డివిజనల్ సహకార అధికారి ప్రాథమిక విచారణలో గుర్తించడంతో సహకార చట్టంలోని కీలకమైన 51 విచారణకు ఉత్తర్వులు వచ్చినా వాటిని ఎలాగోలా ఆపేస్తున్నారు. హైకోర్టులో కేసులు వేయించి మధ్యలోనే విచారణలు ఆపేలా చేస్తున్నారు. దీంతో కోట్ల రికవరీలు చేయలేక అధికారులు చతికిలపడుతున్నారు. ఎక్కువగా వైసీపీ ప్రభుత్వం హయాంలోనే ఆనాటి పాలకుల అండతో సెక్రటరీలు చేతివాటం ప్రదర్శించారు. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన డీసీవో, డీసీసీబీ సీఈవో, ఇతర సభ్యులతో కూడిన టీమ్‌లు ప్రతీ మూడు నెలలుకొకమారు అక్రమాలపై సమీక్షించాల్సి ఉన్నప్పటికీ గత 11 నెలలు కాలంలో ఎక్కడా ఆ దాఖలాలు లేవు. తాజాగా పాలక వర్గాలు కొలువు తీరనున్న నేపథ్యంలో రూ.100 కోట్ల పైబడి నష్టాల్లో ఉన్న డీసీసీబీని గట్టెక్కించడానికి వారికి సవాళ్లు ఎదురు కానున్నాయి.

- సస్పెండై హైకోర్టు స్టేతో కొనసాగుతున్న ఓ కార్యదర్శి
- పలుచోట్ల 51 ఎంక్వైరీలు మధ్యలోనే నిలిపివేతలు
- జిల్లా రికవరీ కమిటీ సమావేశాలు తూచ్



- చింతలపూడి సొసైటీలో 25 ఏళ్ల పైబడి కాలం నుంచి పనిచేస్తున్న ఒక సెక్రటరీ రూ.18 కోట్ల పైబడి అక్రమాలకు తీర తీశారు. బినామీల పేరిట రుణాలు ఇచ్చినట్టు సృష్టించి సొంతంగా భూములు కొనుక్కున్నట్లు ఆరోపణలున్నాయి. సొసైటీల ప్రెసిడెంట్లను గుప్పెట్లో పెట్టుకుని నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్టు తెలుస్తోంది. అప్పటి డీసీవో ప్రవీణ్ 51 విచారణకు ఆదేశించినా ఆపై ఏ విధమైన చర్యలు లేవు. కొంత మొత్తాలను ఇటీవల కట్టి.. హైకోర్టు నుంచి స్టే తెచ్చుకుని ఆర్నెళ్ల కాలానికి అక్కడే కొనసాగుతుండడం విశేషం. కొద్ది కాలంలో రిటైర్ కానున్నారు. ఆ తర్వాత ఆయనపై ఏ విధమైన ప్రత్యక్ష చర్యలు తీసుకోవడానికి వీలుండదని సమాచారం. శాఖపరంగా అతని, కుటుంబీకులకు సంబంధించిన 70 ఎకరాల పైబడి ఆస్తులను జప్తు చేశారు. హైకోర్టు స్టేతో అతనిపై విచారణ ఆగినట్టు సమాచారం. ఇక్కడ నగదు, లావాదేవీలను నిలిపివేశారు. డీసీసీబీ నుంచి నేరుగా రైతులకు రుణాలివ్వడం, అక్కడే జమ చేయడం జరుగుతోంది.
- టి.నరసాపురం సొసైటీలో రూ.40 కోట్ల పైనే అక్రమాలు చోటు చేసుకున్నాయి. డీసీసీబీ నుంచి రుణాల మొత్తాలను తీసుకువచ్చి సెక్రటరీ తనకు కావాల్సిన వారికి ఇవ్వడం. వారి కట్టినా ఆయా మొత్తాలను జమ చేయకపోవడంతో నిధులు దుర్వినియోగం భారీగా జరిగింది. సంబంధిత సెక్రటరీని సస్పెండ్ చేసి జైలుకు పంపగా, బెయిల్‌పై వచ్చి బయట తిరుగుతుండడం విశేషం. ఇతని కారణంగా రైతుల ఆస్తులను సీజ్ చేశారు.



వట్లూరు సొసైటీ

- లింగపాలెం మండలం రంగాపురం సొసైటీలో నాలుగేళ్ల క్రితం సుమారు రూ.2కోట్ల మేర కార్యదర్శి చేతివాటం చూపడంతో నిధులు స్వాహా అయ్యాయి. ఈ విషయంలో అప్పటి సొసైటీ అధ్యక్షుడి పాత్రతో పాటు వైసీపీ నాయకులు హస్తం ఉన్నట్లు ఆరోపణలున్నాయి.
- బాదంపూడి సెక్రటరీ సొసైటీలో రూ.70 లక్షల పైనే నిధులు గోల్‌మాల్ చేశాడు. బినామీ పేర్లతో రుణాలు ఇచ్చి, వాటిని అనంతరం కట్టిన తర్వాత గుటక్కాయ స్వాహా చేసేవాడు. అతని వల్ల సొసైటీ అధ్యక్షుడు బలయ్యాడన్న విమర్శలున్నాయి.
- జంగారెడ్డిగూడెంలో రుణాల కోసం తనఖా పెట్టి తీసుకోవాల్సి ఉండగా, పొలాలు లేకపోయినా ఉన్నట్లు సృష్టించి తన కుటుంబ సభ్యులకు రుణాలు రాసుకుని రూ.2 కోట్ల పైబడి సెక్రటరీ అక్రమాలకు పాల్పడ్డాడు. ఆన్‌లైన్ రికార్డులు లేకపోవడంతో చేతితో రాసుకుని రుణాలు పొందాడు. రిటైర్ అయ్యే ముందు ఆర్థిక అవినీతికి పాల్పడ్డాడు. ఈ ఏడాది జనవరి నెలాఖరున రిటైర్ కావాల్సి ఉంది. అయితే అవినీతి ఆరోపణలతో సస్పెండ్ చేశారు. ఒక రైతు రూ.25 లక్షలు పాత బాకీ రుణాన్ని దశలవారీగా చెల్లించినా దాన్ని వాడేసుకున్నాడు. కరోనా సమయంలో రైతుల పేరిట వచ్చిన రుణాలను సొంతానికి వాడేశాడు. వారి సంతకాలతో అవినీతికి పాల్పడ్డాడు. అతని ఆస్తులను అటాచ్ చేయడానికి అధికారులు ఇటీవలే రంగంలోకి దిగారు. కోర్టులో విచారణ నడుస్తోంది. డిక్రీ రావాల్సి ఉంది.
- వట్లూరులో సెక్రటరీ నిధుల దుర్వినియోగం చేశాడు. రూ.70 లక్షలు సొంతానికి వాడేసుకున్నాడు. అతన్ని సస్పెండ్ చేశారు. ఇంకా నిధులు జమ కాలేదు.
- కామవరపుకోట సొసైటీ అధ్యక్షుడు, సెక్రటరీ, సేల్స్‌మెన్ (పెట్రోలుబంకు)లు ఎవరు ఇష్టానుసారంగా వారు రూ. రెండు కోట్ల పైబడి మేసేశారు. సెక్రటరీని సస్పెండ్ చేశారు.

అధికారితో..

## ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లా పరిధిలో భూములు, ప్లాట్ల రిజిస్ట్రేషన్లు విషయంలో క్షేత్రస్థాయిలో ఇబ్బందులున్నాయా? అక్రమంగా నిషేధిత జాబితాలో చేర్చిన వివిధ భూముల వల్ల రిజిస్ట్రేషన్లు ఎక్కడైనా ఆగాయా?.. ఇతర సమస్యలపై ఈ నెల 14న బుధవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు **70939 21440** నెంబరుకు ఫోన్ చేసి తమ సమస్యలను తెలిపితే వాటి పరిష్కారానికి ఏలూరు జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ రిజిస్ట్రార్ కె.శ్రీనివాసరావు చర్యలు తీసుకుంటారు.

**పిట్టలను కొట్టే మందుగుండు పేలి ..**
ముగ్గురికి తీవ్ర గాయాలు

**ఉమ్మడి పశ్చిమ జిల్లాలో తొమ్మిది రకాల బడులకు తుదిరూపు !**

**ఆకస్మిక విపత్తులపై మాక్ డ్రిల్**



లోపలి పేజీలో..

# అడవి ఆక్రందన!



నరికివేయగా మోడుగా మిగిలిన చెట్లు

- వింజరం ఫారెస్ట్ బీట్‌లో వందలాది ఎకరాల్లో అటవీ ప్రాంతం నరికివేత
- క్షేత్రస్థాయిలో పర్యటించిన జిల్లా స్క్వాడ్ డీఎఫ్‌వో
- సర్వే జరుపుతున్నాం : ఎఫ్ఆర్వో

కుక్కునూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : దట్టమైన ఆకుపచ్చని తివాచీల పరుచుకున్న అమరవరం అటవీ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాన్ని చూస్తే ఒకప్పుడు ఆనందం వెల్లివిరిసేది. ఒకప్పటి వంద ఏళ్లనాటి వృక్షాలు పక్షుల కిలకిలరావాలు, వన్యప్రాణుల అడుగులు చప్పుడు వినిపించేది. స్వచ్ఛమైన గాలి వీచేది. కానీ ఇప్పుడు భయానకమైన పరిస్థితులు ఎదురవుతున్నాయి. మనుషుల అత్యాశ, స్వార్థం అడవి తల్లి గుండెను చీల్చుతోంది. వందలాది ఎకరాల్లో పచ్చని సంపద కళ్ల ముందే నాశనం అవుతోంది. వందల ఏళ్ల నాటి మహావృక్షాలు ఇప్పుడు మొండి దుంగలుగా మిగిలిపోతున్నాయి. ఈ విధ్వంసం ఇలాగే కొనసాగితే అమరవరం అటవీరేంజ్ అడవి కేవలం ఓ జ్ఞాపకంగా మిగిలిపోయే ప్రమాదం ఏర్పడింది.

కుక్కునూరు మండలం అటవీ రేంజ్ పరిధిలో వింజరం బీట్‌లో ఎకరం కాదు రెండేకరాలు కాదు వందలాది ఎకరాల అడవిని యథేచ్ఛగా నరికేస్తున్నారు. అడవులను కాపాడడానికి ఓ అధికారి, కింది స్థాయి సిబ్బంది ఉన్నప్పటికి మమ్మల్ని అడిగేది ఎవరూ.. ఆపేదెవరు అనే ధైర్యంతో చెట్లు నరికివేస్తూ పోడు సాగుకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ క్రమంలో వందల ఏళ్ల నాటి భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. ఆపై మంటపెట్టి ఆ చెట్లను కాల్చివేస్తున్నారు. వలస ఆదివాసీలతో ఇప్పటికే వేలాది ఎకరాల్లో అడవి ధ్వంసమైంది. ఇప్పుడు స్థానిక గిరిజన, గిరిజనేతరుల చూపు అడవిపై పడింది. రిజర్వ్ అటవీ ప్రాంతాన్ని కూడా అధికారులు కాపాడలేకపోతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇంత భారీఎత్తున అడవులు విధ్వంసం జరుగుతున్నా క్షేత్రస్థాయిలో అటవీ సిబ్బంది అడ్డుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అడవి అంతా నాశనం అయ్యాక అధికారులు వచ్చి విచారణ చేపడితే ఏం ప్రయోజనమని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



భారీ వృక్షాలను నేలకూల్చి ఇలా తగలబెట్టేస్తున్నారు..

దిద్దుబాటు చర్యల్లో భాగంగానే సర్వేలు జరుపుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. అమరవరం అటవీ రేంజ్ పరిధిలోని వింజరం, భువనగిరి, అల్లిగూడెం తదితర ప్రాంతాల్లో అటవీప్రాంతాన్ని ఆక్రమించి నర్సరీలు ఏర్పాటు చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకుంటేనే అటవీ విధ్వంసం ఆగుతుందన్న అభిప్రాయాన్ని స్థానికులు, పర్యావరణ ప్రేమికులు వ్యక్తం చేస్తున్నారు.

వింజరంలో జరిగిన వందలాది ఎకరాల్లో అటవీ విధ్వంసంపై జిల్లా అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు వెళ్లింది. ఈ క్రమంలో స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసరావు సోమవారం క్షేత్రస్థాయిలో పర్యటిం చారు. కాగా వింజరం బీట్‌లో అడవుల నరికివేతపై అమరవరం అటవీరేంజ్ అధికారిణి సత్యపద్మజ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. దీనిపై ఇప్పటికే విచారణ చేపట్టామన్నారు. ఎన్ని ఎకరాల్లో అడవి నరికివేత జరిగిందో సర్వే చేసి తెలుసుకుంటామన్నారు. అడవి నరికిన వారిని, ఆ భూములు సాగు చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.



చెట్లను నరికి సాగుకు సిద్ధం చేసిన అటవీప్రాంతం

# హాక్వా విశ్వవిద్యాలయం

## ప్రభుత్వ భవనం లేదు.. అద్దెకు ఎవరూ ఇవ్వరు!



పిల్లర్ల దశలోనే నిలిచిన ఆక్వా విశ్వవిద్యాలయ భవన నిర్మాణం

గోదావరి జిల్లాలు దేశంలోనే ఆక్వా ఉత్పత్తుల్లో ప్రథమ స్థానంలో నిలిచాయి. ఆక్వా సంబంధిత కోర్సులు అందించడానికి ఆక్వా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేస్తామని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం హామీ ఇచ్చారు. తర్వాత ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలనలో మొక్కుబడి చర్యలు తీసుకున్నారు. నరసాపురంలో ఆక్వా విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినా భవనం, కార్యాలయాలు లేవు. తరగతి గదులు, ప్రయోగశాల, లైబ్రరీ ఏర్పాటు చేయలేదు. ఎన్నికల ముందు ఏడాది హడావుడిగా ప్రవేశాలు నిర్వహించి విద్యార్థులను గాలికొదిలేశారు.

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

పేరుకే విశ్వవిద్యాలయం.. కనీసం తరగతులు నిర్వహించే పరిస్థితి లేదు. భవనాలు, కార్యాలయం, తరగతి గదులే కాదు.. ఆక్వా విద్యకు కీలకమైన ప్రయోగశాలల ఆచూకీ లేదు. పిల్ల పెంపకం నుంచి, చేప, రొయ్యల సాగు, వ్యాధుల నిర్ధారణ, నివారణ వంటి చర్యలకు ప్రయోగాత్మక బోధన చేపట్టాలి. కానీ విద్యార్థులు తరగతి గదులకే పరిమితమవుతున్నారు. తుఫాన్ భవనంలో ఉన్న చిన్న చిన్న ల్యాబ్‌లనే వినియోగించుకుంటున్నారు. పది రోజుల పాటు ఉండి కృషి విజ్ఞాన కేంద్రంలో మత్స్య పరిశోధన స్థానాలను సందర్శిస్తున్నారు. పది రోజుల కోసం విద్యార్థులకు ఉచిత బస్సును ఏర్పాటు చేస్తున్నారు. వాస్తవానికి ఆక్వా విశ్వవిద్యాలయానికి ప్రత్యేక బస్సును సమకూర్చాలి. అవసరమైనప్పుడు విద్యార్థులు మత్స్య పరిశోధన కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. అప్పుడే నాణ్యమైన విద్యతో నిపుణులుగా విద్యార్థులు బయటకు వస్తారు. ఇప్పటికే రెండు బ్యాచ్‌లకు నరసాపురం కళాశాలలో ప్రవేశాలు కల్పించారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగియడంతో వేసవి సెలవుల తర్వాత మరో బ్యాచ్ రానుంది. ఇప్పటి వరకు మూడు బ్యాచ్‌లకు 40 మంది చొప్పున విద్యార్థులకు అవకాశం కల్పిస్తున్నారు.

- తుఫాన్ భవనంలో తరగతులు
- ఉండి కేవీకేలో ప్రయోగాలు
- ల్యాబ్‌లు లేవు... లైబ్రరీ లేదు..
- గాలికొదిలేసిన గత ప్రభుత్వం
- విద్యార్థులకు తప్పని తిప్పలు

### హాస్టల్ వసతి లేక ఇబ్బందులు

విశ్వవిద్యాలయం ఏర్పాటు చేసినప్పుడు అనుబంధంగా హాస్టల్ ఏర్పాటు చేయాలి. కనీసం తాత్కాలిక భవనాల్లోనైనా హాస్టల్స్ ఏర్పాటు చేయాలి. తరగతులకు దిక్కులేనప్పుడు హాస్టల్ ఏర్పాటు అత్యాశగానే కనిపిస్తోంది. హాస్టల్ కోసం ప్రైవేటు భవనాల కోసం నరసాపురంలో ప్రయత్నించినా లభ్యం కాక ప్రైవేటు పీజీ హాస్టల్స్‌లో ఇబ్బందులు పడుతున్నారు.

### నత్తనడకన పనులు

ఆక్వా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు నరసాపురం మండలం లిఖితపూడి వద్ద 40 ఎకరాలు కేటాయించారు. భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. కొంతభాగం పిల్లర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇతర స్థలమంతా పూడికతోనే సరిపెట్టారు. నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పరిపాలనా భవనం, కళాశాల. వైస్ ఛాన్స్‌లర్ బంగ్లా, స్టాఫ్ క్వార్టర్స్, విద్యార్థులకు హాస్టల్స్ నిర్మించాలి. నిధులు కేటాయించకుంటే పనులు పూర్తయ్యే అవకాశం లేదు. శాశ్వత క్యాంపస్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాల్సి ఉంది.

నూతన విద్యా సంవత్సరం మూడో బ్యాచ్ రానుంది. అనుభవజ్ఞు లైన సిబ్బంది ఉన్నా వసతుల లేమి వేధిస్తోంది. స్వర్ణాంధ్ర కళాశాలలో తాత్కాలికంగా తరగ తులు నిర్వహించడానికి అవకాశం ఇస్తామని యాజమాన్యం ముందుకొచ్చింది. ప్రభుత్వ అనుమతి రాకపోవడంతో రెండు పర్యాయాలు చేసిన ప్రయత్నాలు వృథా అయ్యాయి. తాజాగా మరోసారి ప్రభుత్వ అనుమతి కోసం ప్రయత్నిస్తున్నారు. మరోవైపు ప్రయోగాలకు అవసరమైన ఆక్వా ల్యాబ్‌లను నిర్మించాలి. సాగుకు అనువుగా చెరువులను ఏర్పాటు చేయాలి. గత ప్రభుత్వంలో ఆక్వా పార్క్ ఏర్పాటుకు భూమిని కేటాయించగా పూడికతో సరిపెట్టారు. ఆక్వా విశ్వవిద్యాలయానికి అనుసంధానంగా ఆక్వా పార్క్ ఉంటుందని అప్పట్లో వైసీపీ నేతలు హడావుడి చేశారు. చుట్టు పక్కల సొంత చెరువులు ఉండేలా ప్రణాళికలు చేసుకున్నారు కానీ పార్క్ అందుబాటులోకి రాలేదు. ఇప్పుడైనా ఆక్వా పార్క్ అభివృద్ధి చేస్తే విద్యార్థుల ప్రయోగశాలగా అది ఉపయోగపడుతుంది.

### తుఫాన్ భవనంలో తరగతులు!

నరసాపురం మండలం లక్ష్మీపురం తుఫాను భవనంలో ఆక్వా బీఎస్సీ తరగతులు నిర్వహిస్తున్నారు. అద్దె భవనాల కోసం అధికారులు ప్రయత్నించినా ప్రయోజనం లేదు. నరసాపురంలో ప్రైవేటు కళాశాలలను సంప్రదించగా ఒక కళాశాల ముందుకొచ్చింది. అక్కడ తరగతులు నిర్వహణకు ఇంకా అనుమతి రాలేదు. తుఫాను భవనంలోనే తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. అక్కడ విద్యార్థులకు సరైన మౌలిక వసతులు లేవు. నానా ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. గత ప్రభుత్వంలో దిద్దుబాటు చర్యలు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా విద్యార్థులకు న్యాయం జరుగుతుందన్న ఆశతో అంతా ఎదురుచూస్తున్నారు.



## 594 సెల్‌ఫోన్ల రికవరీ



ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో అపహరణకు గురైన, పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ల ఫిర్యాదులపై సీసీఎస్, సైబర్ క్రైం, లా అండ్ ఆర్డర్ విభాగాల సమష్టి కృషితో గత మూడు నెలల్లో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించబడిన 594 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ 71 లక్షల 28 వేల రూపాయలు ఉంటుందని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. ఏలూరులోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 15 విడతల్లో 2,976 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని వీటి విలువ రూ.నాలుగు కోట్ల 75 లక్షలు ఉంటుందన్నారు. దొంగిలించిన వస్తువులను కొనుగోలు చేయడం లేదా అమ్మడం నేరమని భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 317 ప్రకారం మూడేళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు. మొబైల్ పోయినా దొంగిలించబడిన వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి సీఈఐఆర్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. సైబర్ నేరాల నివేదిక కోసం 1930కు కాల్ చేయాలని సూచించా రు. సెల్‌ఫోన్ బాధితులకు ఎస్పీ స్వయంగా సెల్ ఫోన్లను అందించారు.సెల్‌ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబర్చిన ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ రాజశేఖర్, సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు. ఏఎస్పీ సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు పాల్గొన్నారు.



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ

## జిల్లా జంతు సంరక్షణ పర్యవేక్షణ అధికారిగా డీటీసీ డీఎస్పీ

ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు జిల్లాలో జంతు సంరక్షణకు ప్రత్యేక పర్యవేక్షణ అధికారిగా పెదవేగి డీటీసీ డీఎస్పీ ప్రసాదరావును నియమిస్తూ జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై సమాచారం సేకరించి చట్టపరమైన చర్యలు తీసుకునేలా ప్రత్యేక పర్యవేక్షణ అధికారికి ఆదేశాలు జారీ చేసినట్టు ఎస్పీ తెలిపారు. జిల్లాలో ప్రజలు జంతువుల అక్రమ రవాణా, గోవధకు సంబంధించిన ఏదైనా సమాచారం ఉంటే ఏలూరు జిల్లా నోడల్ అధికారి ప్రసాదరావు సెల్ నంబర్ 94404 04010కు సమాచారం అందించాలన్నారు.

# కుక్క..తిక్క



## వేసవి ఎండలకు రెచ్చిపోతున్న శునకాలు

### ఎండదెబ్బ, ఆహారపదార్థాల కొరతతో మనుషులపై దాడులు

### ఆసుపత్రులకు పరుగెడుతున్న కుక్కకాటు బాధితులు

ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : వేసవి ఎండలకు మానవులే కాదు, జంతువులు, పశు పక్ష్యాదులు తల్లడిల్లిపోతున్నాయి. వేసవిలో ముఖ్యంగా కుక్కలు రోడ్ల పైన పడుకునే ఉంటున్నాయి. సాధారణంగా కుక్కలు రాత్రివేళ మెలకువగా ఉంటూ తెల్లవారు జామున 4 గంటల నుంచి నిద్రపోతాయి. పగలు అవకాశాన్ని బట్టి అవి కాస్త మాగన్నుగా నిద్ర పోతూ ఉంటాయి. ఎక్కువ శాతం కుక్కలు వాటికి ఎక్కడ అయితే ఆహారం పెడతారో ఆ ఇంటి సమీపంలో లేదా రోడ్డు ముందే తిష్టవేసి ఉంటాయి.కానీ ప్రస్తుతం మండుతున్న ఎండలకు కుక్కలు వడదెబ్బకు గురై అవి



కూడా ఎక్కడపడితే అక్కడ రోడ్లపైన పడుకుంటున్నాయి. ఆ సమయంలో వాహనదారులు ఎవరైనా ఆ పక్క నుంచి వెళితే వారిపైన దాడులు చేస్తున్నాయి. జిల్లాలో రోజుకు 100 మంది పైగా బాధితులు కుక్క కాటు బారిన పడుతూనే ఉన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రికి రోజుకు కొత్త కుక్కకాటు బాధితులు 25 నుంచి 35 మంది వస్తున్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలోనే కుక్కకాటు ఇంజక్షన్లు రోజుకు 100 మందికి చేస్తున్నారు.

#### ఆహారం కోసం దాడులు

గతంలో కుక్కలను మందుపెట్టి హతమార్చేవారు. వాటిని చంపకూడదనే నిబంధనలు అమలులో ఉండడంతో చివరకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తున్నారు. గతంలో ఇళ్లల్లో వంటలు చేసుకుని మిగిలిన అన్నం వీధికుక్కలకు పెట్టేవారు. ప్రస్తుతం ఎక్కువశాతం మంది ఆరోగ్య నియమాలు అంటూ ఆహారాన్ని తినడం తగ్గించేశారు. మరికొంత మంది వంటలు చేసుకునే సమయం లేకపోవడంతో తమకు సరిపోయేలా స్విగ్గీ, జమాటాల్లో ఆర్డర్ పెట్టుకుని తెప్పించుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే వీధి కుక్కలకు ఆహారం దొరక్క ఆకలితో తల్లడిల్లిపోతూ ఎవరైనా చేతిలో ఆహార పదార్థాలు పట్టుకు వెళ్తుంటే వాసన పసిగట్టి వారిపై దాడి చేస్తున్నాయి. ముఖ్యంగా పిల్లల పైనే ఎక్కువగా దాడులు చేస్తున్నాయి.

#### ఈ జాగ్రత్తలు ఎంతో ముఖ్యం

కుక్క కరిచిన వెంటనే గాయాన్ని సబ్బుతో 15 నుంచి 25 నిముషాలు పంపు కింద లేదా జాలువారే నీటి కింద కడగాలి. టీటీ ఇంజక్షన్ వేయించుకోవాలి. సాధారణంగా మూడు డోసుల ఏఆర్‌వీ ఇంజక్షన్ చేయించుకోవాలి. 1,3,7,28 రోజుల వారీగా ఈ డోసు తీసుకోవాలి. వీటితో పాటు ఇమ్యూనోగ్లోబ్యులిన్ ఇంజక్షన్ చేయించుకోవాలి. ఒకవేళ మెదడుకు దగ్గరలో కాని నరాలపై కరిస్తే ఖచ్చితంగా సీరమ్ ఇంజక్షన్ చేయించు కోవాలి. కుక్క కరిచిన తర్వాత పత్యం అనేది అవసరమే లేదు. కుక్క కరిచిన పది రోజుల వరకూ ఆ కుక్కను పరిశీలించాలి. అది మరణిస్తే ఖచ్చితంగా రాబిస్ వ్యాధి ఉన్నట్లేనని గుర్తించాలి. పెంపుడు కుక్కలకు ఖచ్చితంగా ఏఆర్‌వీ డోసు ఇంజక్షన్లు చేయించాలి.

#### నిర్లక్ష్యం వద్దు



రాబిస్ వ్యాధి ఎక్కువ శాతం కుక్కకాటు వల్లే వస్తుంది. పెంపుడు కుక్కలకు ఏఆర్‌వీ వ్యాక్సిన్లు వేయించాలి. కుక్క కరిస్తే నిర్లక్ష్యం చేయకూడదు. కరిచిన వెంటనే 15 నిముషాల నుంచి 25 నిముషాల పాటు సబ్బుతో కడగాలి. కుక్కకాటు గాయాలపైన పసుపు, కాఫీపొడి వంటి వాటిని వేయకూడదు. కట్లు కట్టకూడదు. వైద్యులను వెంటనే సంప్రదించాలి. ఎక్కువ భాగం గాయం అయితే సీరమ్ ఇంజక్షన్ ఇచ్చి కుట్లు వేస్తారు. కుక్కలు సాధారణంగా పశువులను కరుస్తూ ఉంటాయి. ఆ పశువుల నోటి వెంబడి జాలువారే లాలాజలంతో కూడా రాబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. పాలిచ్చే ఆవులు, గేదెలను కుక్క కాటు వేస్తే పాలు తీయకూడదు, తాగకూడదు. వాటికి కూడా ఏఆర్‌వీ ఇంజక్షన్లు ఇప్పించాలి. వేసవి సెలవులు కావడంతో పిల్లలు ఆటలకు వీధుల్లోకి వెళుతూ ఉంటారు. కుక్కలు ఉండే ప్రాంతాలకు వెళ్లనీయకుండా జాగ్రత్తపడాలి. 24 గంటలు ప్రభుత్వాసుపత్రిలో వైద్య సేవలు అందిస్తారు. ఏఆర్‌వీ ఇంజక్షన్లు ఉన్నాయి.

**డాక్టర్ ఎం.సుమన్, అత్యవసర విభాగపు వైద్య నిపుణుడు, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, ఏలూరు**



## కొల్లేరు పక్షుల విలవిల..

కైకలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ఎండ వేడికి కొల్లేరు పక్షులు సైతం విలవిల్లాడుతున్నాయి. కొల్లేరులో నీరు లేక అడుగంటిపోవడంతో పక్షులు చిన్నచిన్న నీటిగుంటల వద్ద దాహార్తిని తీర్చుకుని సేద తీరుతున్నాయి. స్వదేశీ, విదేశీ పక్షులు సైతం నీటి కోసం సుదూర ప్రాంతాలకు తరలి వెళుతున్నాయి. ఆటపాక పక్షుల కేంద్రంలో నీరు అడుగంటిపోవడంతో విదేశీ వలస పక్షులు కొల్లేరు సరస్సు నడిబొడ్డున ఉన్న నీటి గుంటలను, సమీపాన ఉన్న చేపల చెరువుల్లోకి వెళుతున్నాయి. దీంతో కొల్లేరులో నీరు లేకపోవడంతో మేత పుష్కలంగా లేక పక్షులు అల్లాడుతున్నాయి.

కొల్లేరులో చిన్నపాటి నీటిగుంటల్లో సేద తీరుతున్న పక్షులు

# పచ్చళ్ల సీజన్

## వీరికి ఉపాధి

గణపవరం, మే13 (ఆంధ్రజ్యోతి): వైశాఖ మాసం వచ్చిందంటే ప్రతీ ఇళ్ల మామిడి పచ్చళ్లతో కళకళాడుతుంటాయి. గణపవరం మార్కెట్‌లో పచ్చడి మామిడికాయలు ముంచెత్తాయి. ఈ ఏడాది పొడవునా మామిడితో చేసే పచ్చళ్లను నిల్వ చేసుకునేందుకు ప్రతీ తెలుగింటిలో స్తోమతలను బట్టి తయారు చేస్తుంటారు. ఆవకాయ పచ్చళ్లకు చిన్నరసాలు 100 కాయలు రూ.1000 నుంచి 1200, కొత్తపల్లి కొబ్బరి వందకాయలు రూ.2 వేల నుంచి 2500 వరకు అమ్ముతుండగా బజర్లు కూడా ఇంచుమించు ఇవే ధరలు పలుకుతున్నాయి, మాగాయి పచ్చళ్లకు అధికంగా వినియోగించు కునే రకాలు 1200 నుంచి 1500 వరకు విక్రయాలు జరిగాయి. మెట్ట ప్రాంతమైన చింతలపూడి, జంగారెడ్డిగూడెం, జీ.కొత్తపల్లి, కంసాలిగుట్టతో పాటు తుని ప్రధానంగా తదితర ప్రాంతాల నుంచి ఈ మామిడి కాయలు దిగుమతి అవుతుంటాయి.



పచ్చడి కోసం ముక్కలు నరుకుతున్న దృశ్యం



#### పలువురికి ఉపాధి

ఈ పచ్చడి సీజన్‌లో ముక్కలు కోసేవారికి ఉపాధి లభిస్తుంది. వారపుసంతలకు, పచ్చడి సీజన్ రోజుల్లోనూ మామిడిముక్కలు నరికే మహిళలతో సహా కుటుంబాలు తరలివచ్చి మామిడి ముక్కలు నరకటమే జీవనోపాధిగా మలుచుకుంటున్నారు. జిల్లాలోని తాడేపల్లి గూడెం, పెనుమంట్ర, మార్టేరు, మాముడూరు, పాలకొల్లు, ఆకివీడు, భీమవరం, గణపవరం తదితర ప్రాంతాల నుంచి సుమారు 20 కుటుంబాలకు చెందిన మహిళలతో సహా వచ్చి పచ్చడి మామిడి ముక్కలను నరికి ఉపాధి పొందుతున్నారు. కాయకు రూ.4 చొప్పున 100 కాయలకు రూ.400 తీసుకుంటారు. గత ఏడాదికి కాయకు రూ.3 చొప్పున వంద కాయలకు రూ.300 వసూలు చేయగా ఈ ఏడాది మాత్రం కాయకు రూ.4 చొప్పున తీసుకుంటున్నారు. అలాగే ఆవకాయ, మాగాయ పచ్చళ్లు పట్టేందుకు కూడా 100 కాయలకు రూ.150 నుంచి రూ.200 వరకు మహిళలు తీసుకుంటున్నారు. పచ్చళ్లు పట్టే అను భవం లేనివారు ఈ పచ్చళ్లు పట్టే మహిళలను ఆశ్రయిస్తున్నారు. పలు కుటుంబాలకు ఈ వేసవి నెలరోజులు జీవనోపాధిగా మారిందని ముక్కలు నరికేవారు, పచ్చళ్లు పట్టే మహిళలు తెలిపారు.

# భీమవరం ప్రభుత్వాసుపత్రికి కొత్త వెలుగు

### ఫ్యాన్లు, లైట్లు కొత్తవి ఏర్పాటు

### గత ప్రభుత్వంలో మరమ్మతులకు గురైనా పట్టించుకోని అధికారులు

భీమవరం క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : భీమవరం ప్రభుత్వ ఆసుపత్రి కొత్త రూపు సంతరించుకుంటుంది. గత వైసీపీ ప్రభుత్వంలో ఒక్క రూపాయి కూడా ఖర్చుపెట్టకుండా ఆసుపత్రి అభివృద్ధిని కుంటుపడేలా చేయడంతో ఆసుపత్రికి వచ్చిన రోగులు అనేక అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆసుపత్రులపై ప్రత్యేక దృష్టి పెట్టింది. జిల్లాలోని ఎంతో పేరుగాంచిన భీమవరం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి నిత్యం 300 నుంచి 400 వరకు ఓపీ రోగులు వస్తూ ఉంటారు. అలాగే ఆసుపత్రిలో 60 నుంచి 70 మంది వరకు వైద్యం పొందుతూ ఉంటారు. అలాంటి పేరున్న ఆసుపత్రిలో సేవలు అంతంత మాత్రంగా ఉండటంతో అధికారులు దృష్టి పెట్టారు. గత ప్రభుత్వ హయాంలో మూలనపడ్డ ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు, సీసీ కెమెరాలు వంటివి తొలగించి వాటి స్థానంలో కొత్తగా ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. ఆ కోణంలోనే భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి 250 ట్యూబ్‌లైట్లు, 100 ఫ్యాన్లు ఏర్పాటు చేస్తున్నారు. రెండు రోజులుగా ఆ పనులు కొనసాగుతున్నాయి. గతంలో రోగులు సరైన ఫ్యాన్లు, లైట్లు లేక అవస్థలు పడేవారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఫ్యాన్లు తిరగకపోవడంతో అసహనం వ్యక్తం చేసేవారు. ఇప్పుడు ఫ్యాన్లు ఏర్పాటు వల్ల కొంత వరకు అవస్థలు తప్పుతాయని అంటున్నారు.

#### అభివృద్ధి కమిటీ ఏర్పాటయ్యేనా.. ?

గత తెలుగు దేశం ప్రభుత్వంలో 2014 నుంచి 2019 వరకు అభివృద్ధి కమిటీ ఏర్పాటు చేసి ఆసుపత్రిలో కావలసిన వసతులు, వాటికి రావలసిన నిధులు, పలు అంశాలపై కమిటీ చర్చించి తీర్మానాలు చేసేది. తద్వారా ఆ నివేదికను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్ళి ఎంతో కొంత ఆసుపత్రికి మేలు జరిగే విధంగా కృషి చేసేవారు.2019 నుంచి వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అభివృద్ధి కమిటీ అనేది లేకుండాపోయింది. ఏదో ఏర్పాటు చేశామన్న చందాన కమిటీ ఏర్పాటు చేశారు తప్ప ఒక్క సమావేశం కూడా లేకపోవడంతో ఆసుపత్రి అభివృద్ధి కుంటుపడింది. అభివృద్ధి కమిటీ ఉంటే నెలకు రెండు నుంచి మూడుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసి ఆసుపత్రికి కావలసిన పరికరాలు ఏర్పాటు చేసేవారు. కూటమి ప్రభుత్వం వచ్చి సుమారు ఏడాది కావస్తున్నా కూడా ఇప్పటివరకు అభివృద్ధి కమిటీ ఏర్పాటు కాకపోవడంపై పలువురు నుంచి ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. కమిటీ ఏర్పాటు చేయాలని, ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసి 100 పడకల ఆసుపత్రిగా మార్పు చేయాలని పలువురు కోరుతున్నారు.



లైట్ల ఏర్పాటు



ఫ్యాన్లు బిగిస్తున్న ఎలక్ట్రీషియన్లు



థియేటర్‌లో మాట్లాడుతున్న చిత్ర హీరో శ్రీవిష్ణు

## ఏలూరులో సింగిల్ మూవీ యూనిట్ సందడి

ఏలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : గీతా ఆర్ట్స్ బ్యానర్‌పై తెరకెక్కిన సింగిల్ చిత్రం యూనిట్ సభ్యులు మంగళవారం ఏలూరులో సందడి చేశారు. హీరో శ్రీవిష్ణు, హీరోయిన్ కేతిక శర్మ, లవ్‌టుడే ఫేమ్ ఇవానా హీరో హీరోయిన్లుగా నటించిన సింగిల్ మూవీ ఇటీవల విడుదలైన అన్ని థియేటర్స్‌లో విజయవంతంగా ప్రదర్శించబడుతుంది. చిత్ర విజయయాత్రలో భాగంగా యూనిట్ సభ్యులు ఏలూరు ఎస్‌వీఎస్ థియేటర్‌లో మ్యాట్నీ షోలో సందడి చేశారు. ప్రేక్షకులను అలరింపజేశారు. చిత్రంలో డైలాగులు చెప్పి, చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో శ్రీవిష్ణు, డైరెక్టర్ కార్తీక్‌రాజు మాట్లాడుతూ సింగిల్ మూవీ విడుదలైన ప్రతీచోట హిట్ టాక్ వస్తుందన్నారు. కామిడీతో పాటు కుటుంబ సమేతంగా చూసేవిధంగా చిత్రాన్ని రూపొందించినట్లు తెలిపారు.కమెడియన్ వెన్నల కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

## సారాను వదిలిపెట్టిన వారికి ప్రత్యామ్నాయ ఉపాధి

### 14405 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు

### కలెక్టర్‌కు వివరించిన ఎక్సైజ్‌శాఖ అధికారులు

ఏలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : సారా నిరోధానికి ఎక్సైజ్, ఇతరశాఖలు సంయుక్తంగా నిర్వహించిన నవోదయం-2.0 పురోగతిని కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం రాత్రి సమీక్షించారు. ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన 142 గ్రామాల్లో 113 గ్రామాల్లో సారా నిర్మూలన చేపట్టామన్నారు. మిగతా 29 గ్రామాల్లో ఈ నెలాఖరులోగా సారాను పూర్తిగా నిర్మూలిస్తామన్నారు. జిల్లాలో సారాకు దూరంగా ఉన్న వారికి ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించేందుకు 14405 ట్రోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశామన్నారు. దీన్ని వినియోగించడానికి ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా ఎక్సైజ్‌శాఖ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య, అసిస్టెంట్ సూపరింటెండెంట్ పాండురంగారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

## శాస్త్రోక్తంగా...శ్రీచక్రవార్యుత్సవం



ద్వారకాతిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి వైశాఖ మాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో విశేష కార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం శ్రీచక్రవార్యుత్సవం ఆలయ యాగశాల ప్రాంగణంలో శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ఆవరణలో శ్రీవారు, అమ్మవార్లు, చక్రపెరుమాళ్లను ఒక వేదికపై ఉంచి పూజలు చేశారు. సుగంధ ద్రవ్యాలు, పంచపల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత జలంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. చక్రపెరుమాళ్లను శిరస్సుపై ఉంచి అర్చకులు పలువురికి స్నానం చేయించారు. పూర్ణాహుతి హోమం నిర్వహించారు. సాయంత్రం సర్వాది దేవతలకు ఉద్వాసనగా ధ్వజావరోహణ జరిగాయి.

ఉభయనాంచారులతో చిన్నతిరుమలేశుడు మంగళవారం ఉదయం తిరువీధుల్లో అట్టహాసంగా ఊరేగారు. తొళక్క వాహనంపై శ్రీచక్రపెరుమాళ్ళ, ఉభయదేవేరులతో చిన వెంకన్నను ఉంచి ప్రత్యేక పుష్పాలంకారాలు చేశారు. అనంతరం సన్నాయివాయిద్యాలు, అర్చకుల వేదమంత్రోచ్చరణల నడుమ క్షేత్ర తిరువీధుల్లో ఊరేగించారు.

#### కాళీయమర్దనుడిగా శ్రీవారు

కాళీయమర్ధనుడిగా శ్రీవారు మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. కాళింది మడుగున కాళీ యుడనే విషసర్పం మదాన్ని అణిచివేసే విధంగా ఉన్న ఈ అలంకారం భక్తజనులకు నేత్రపర్వ మైంది. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.



#### వైభవంగా వేదసభ

హిందూ ధర్మాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ సాధ్యమని ఆలయ అర్చకులు ఉద్బోధించారు. చినవెంకన్న ఆస్థానంలో మంగళవారం సాయంత్రం వేదసభ నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను తొళక్కం వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకారాలు చేశారు. వేదికపై అర్చకులు వారికి ఎదురుగా పండితులు, అధికారులు, ఆగమ విద్యార్థులు కొలువుతీరారు. కల్యాణమూర్తులను కీర్తిస్తూ మంత్రోచ్చరణలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, పండితులు, అధికారులను ఆలయ ప్రధాన అర్చకులు పెద్దింటి అలహసింగరాచార్యులు సత్కరించారు.

## పద్మావతీ సరోవరంలో కాళ్లకూరు వెంకన్నకు..

కాళ్ళమే 13 (ఆంధ్రజ్యోతి): కాళ్లకూరులో ఉన్న స్వయంభూ వేంకటేశ్వరస్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ముగింపు సందర్భంగా మంగళవారం స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు పద్మావతీ సరోవరంలో చక్రస్నానం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. కాళ్ళ ఎస్‌ఐ ఎస్.శ్రీనివాసరావు దంపతులు స్వామి అమ్మవార్లకు వసంతోత్సవం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేశారు. సాయంత్రం స్వామి అమ్మవార్లకు అశ్వవాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎం.అరుణ్‌కుమార్, సిబ్బంది పర్యవేక్షించారు.





హనుమజ్జయంతి ఉత్సవాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

## 17 నుంచి హనుమజ్జయంతి ఉత్సవాలు

హనుమాన్ జంక్షన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా హనుమజ్జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఈ నెల 17 నుంచి 22 వరకు స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతి ఉత్సవాలకు సంబంధించి ఆలయ ఈవో తారకేశ్వరరావు ఆధ్వర్యంలో స్థానిక గ్రామపెద్దలు మంగళవారం ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఉత్సవ పోస్టర్లు, కరపత్రాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఎమ్మెల్యేతో పాటు ఎంపీ పుట్టా మహేశ్‌యాదవ్, జిల్లా అధికారులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు వేమూరి శ్రీనివాసరావు, వడ్డి వాసవి, తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్‌వోకు ఫిర్యాదు చేస్తున్న ప్రైవేట్ ల్యాబ్స్ అసోసియేషన్ జిల్లా నాయకులు

## ప్రైవేటు ల్యాబ్స్ నిర్వాహకుల ఫిర్యాదు

ఏలూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందిమంటూ బెదిరింపులు, ఆపై లంచాలను డిమాండ్ చేస్తున్న వైనంపై జిల్లా ప్రైవేట్ ల్యాబ్స్, ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వరప్రసాద్, సతీష్, కోశాధికారి సత్యకుమార్, తదితరులు మంగళవారం రాత్రి డీఎంహెచ్‌వో డాక్టర్ మాలినికి ఫిర్యాదు చేశారు. సంఘ నాయ కులు మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ కోర్సును పూర్తిచేసుకుని స్వయం ఉపాధికోసం ల్యాబ్‌లను నిర్వహించుకుంటున్నామని, రోగనిర్ధారణ సేవల్లో లోపాలున్నాయంటూ పలువురు డీఎంహెచ్‌వో కార్యాలయానికి ఫిర్యాదులు చేస్తున్నారని వాటిపై చర్యలు చేపట్టకుండా ఉండటానికి ఫార్మాలిటీస్ (లంచం)గా ఇవ్వాల్సిందిగా మీనాక్షి పేరుతో ఓ మహిళ డిమాండ్ చేసున్నారని వివరించారు.

గత కొన్ని రోజులుగా అపరిచిత వ్యక్తుల నుంచి ఇటువంటి బెదిరింపు కాల్స్ వస్తున్నాయని తెలిపారు. తమకు వచ్చిన బెదిరింపుల కాల్స్ నెంబర్లను డీఎంహెచ్‌వోకు అందజేసిన ఫిర్యాదులో వివరించారు.డీఎంహెచ్‌వో కార్యాలయ సిబ్బందిగా చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడుతున్న వారిగురించి ఆరా తీసి మోసాన్ని నివారించాలని అభ్యర్థించారు. నకిలీ ఫోన్‌కాల్స్ గురించి కలెక్టర్‌కు తెలియజేస్తానని డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని హామీ ఇచ్చారని సంఘ నాయకులు తెలిపారు.

# 18న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష

## 19 నుంచి 27 వరకు ఏపీ ఈఏపీ సెట్

» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పరీక్ష కేంద్రాలు, అభ్యర్థుల ఖరారు

ఏలూరు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి):దేశంలోని 23 ఐఐటీల్లోని ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఈనెల 18న నిర్వహించే జేఈఈ అడ్వాన్స్‌డ్-2025 పరీక్షకు ఉమ్మడి పశ్చిమ జిల్లాలో పరీక్ష కేంద్రాలు, అభ్యర్థుల సంఖ్య ఖరారయ్యాయి. దీంతోపాటే రాష్ట్రంలోని ఇంజనీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కళాశాలల్లో ప్రవేశాలకు 19నుంచి 27వరకు నిర్వహించే ఏపీ ఈఏపీ ప్రవేశపరీక్ష (ఈఏపీసెట్/పూర్వపు ఎంసెట్)పరీక్ష కేంద్రాలు కూడా ఖరారు చేశారు. జేఈఈ మెయిన్‌లో కటాఫ్ మార్కులు సాధించిన విద్యార్థులకు అడ్వాన్స్‌డ్-2025 పరీక్ష రాసేందుకు అర్హత కల్పించారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు షిఫ్టులో పేపర్-1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు షిఫ్టులో పేపర్-2 పరీక్ష నిర్వహిస్తారు. ప్రతీ విద్యార్థి రెండు పేపర్లనూ రాయాల్సి ఉంటుంది. పరీక్ష కేంద్రాలుగా ఎంపికైన ఏలూరు సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలకు 180 మంది విద్యార్థులు చొప్పున, సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలుకు 144మంది చొప్పున విద్యార్థులను కేటాయిం చారు. పరీక్ష ప్రారంభసమయానికి అరగంట ముందే పరీక్ష కేంద్రం ప్రధాన ప్రవేశద్వారాన్ని మూసివేస్తారు.

### ఏపీ ఈఏపీ సెట్ కేంద్రాలు..

ఈనెల 19, 20 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు, 21, 22,23,24,26,27తేదీల్లో ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ఈఏపీసెట్ పరీక్షలను నిర్వహించనున్నారు. పరీక్షలు ఉదయం షిఫ్టులో 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం షిఫ్టులో 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరుగుతాయి. అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రానికి ఉదయం, మధ్యాహ్నం షిఫ్టుల్లో 190మంది విద్యార్థుల చొప్పున కేటాయించారు. ఇంజనీరింగ్ ప్రవేశ పరీక్షకు 21వ తేదీ నుంచి 26వ తేదీవరకు ఒక్కో షిఫ్టునకు 178 మంది చొప్పున, 27న ఉదయం షిఫ్టునకు 170మంది విద్యార్థులను కేటాయించారు. సిద్ధార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలు పరీక్ష కేంద్రానికి అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ పరీక్షలకు ఒక్కో షిఫ్టునకు 161మంది చొప్పున, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ పరీక్ష కేంద్రానికి అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ పరీక్షలకు ఒక్కో షిఫ్టులో 150మంది విద్యార్థులు చొప్పున కేటాయించారు. పూర్తిస్థాయి మార్గదర్శకాలు కొద్దిరోజుల్లో విడుదలవుతాయి.

### పశ్చిమ గోదావరి జిల్లాలో..

భీమవరం రూరల్ : పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం డీఎన్‌ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో ఈనెల 18న 70 మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష రాయనున్నారు. ఏపీ ఈఏపీ సెట్ పరీక్ష కేంద్రాలు ఇలా.. భీమవరం పట్టణంలో ఎస్‌ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల, డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల, విష్ణు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈ నాలుగు కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తారు. తాడేపల్లిగూడెంలో శశి ఇంజనీరింగ్ కళాశాల, వాసవీ ఇంజనీరింగ్ కళాశాల, నరసాపురంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కాలేజీలో ఈఏపీసెట్ నిర్వహిస్తారు.

## రూ.20 లక్షల అవినీతిపై వారంలో నివేదిక

ద్వారకాతిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): రామన్నగూడెం పంచాయతీలో వార్డు మెంబర్లకు తెలియకుండా రూ.20 లక్షలు నిధులు దుర్వినియోగం అయ్యాయని, ఆ సొమ్మును రికవరీ చేసి పంచాయతీ అభివృద్ధికి వినియోగించాలని వార్డు సభ్యుడు పాకలపాటి భద్రరావు ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారుల నుంచి పరిష్కారం వచ్చింది. ఈ ఏడాది మార్చి 17న భద్రరావు ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం ద్వారా ఫిర్యాదు చేశారు. సదరు ఫిర్యాదుపై ఈనెల 8న రామన్నగూడెం పంచాయతీలో విచారణ నిర్వహించారు. దీనికి సర్పంచ్ నంగెడ్ల జ్యోతి, ఫిర్యాదుదారుడు, ఆరో వార్డు సభ్యుడు పాకలపాటి మాణిక్యాలరావు, పూర్వపు కార్యదర్శులు కె . నాగరాజు, కె.కృష్ణవేణి తదితరులు హాజరయ్యారు. సదరు విచారణ పూర్తిస్థాయి నివేదికను వారం రోజుల్లో ఉన్నతాధికారులకు అందజేయనున్నారు.

## పాత మద్యం కేసులో ఐదుగురి బైండోవర్

భీమవరం క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పాత మద్యం కేసుల్లో పట్టుబడిన ఐదుగురు వ్యక్తులను భీమవరం తహసీల్దార్ వారి వద్ద బైండోవర్ చేశామని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ తెలిపారు. పాలపర్తి జోగయ్య, నేతిపూడి నానిబాబు, రాట్నాల సూర్యావతి, వీరమల్లు భాస్కరరావు, సీహెచ్.శ్యామ్‌సన్ అను వారు ఉన్నారు. ఏడాది కాలపరిమితిలో మరోసారి ఎక్సైజ్ నేరం చేసి దొరికిన యెడల లక్ష రూపాయలు జరిమానా కట్టాలని ఆదేశించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వారి సమక్షంలో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఏలూరు వారి ఆదేశాల మేరకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ భీమవరం పరిధిలో పట్టుబడిన మద్యం సీసాలను భీమవరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో ధ్వంసం చేశామని సీఐ కె.బలరామరాజు తెలిపారు.


## ఇంటర్ సప్లిమెంటరీ పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్/భీమవరం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమ జిల్లాలో ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. ఏలూరు జిల్లాలో ఇంగ్లీషు పరీక్షకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు జనరల్, ఒకేషనల్ విభాగాల్లో 4,858 మందికి 4,635 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 425 మందికి 384మంది హాజరయ్యారని ఆర్‌ఐవో కె.యోహాన్ తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఇంగ్లీష్ పరీక్షకు ప్రథమ సంవత్సరం విద్యార్థులు 8,074 మందికి 7718 హాజరయ్యారు. ద్వితీయ సంవత్సరానికి 396కి 356 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఏ విధమైన మాస్ కాపీయింగ్ జరగలేదని డీఐఈవో నాగేశ్వరరావు తెలిపారు.

## ఢిల్లీ స్కూల్ ప్రిన్సిపాల్‌పై ఆరోపణల వెల్లువ

పాలకోడేరు, మే 13(ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరులోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ కృష్ణారావుపై పలు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమంలో పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్‌కు ఒకరు తన కుమార్తెపై ప్రిన్సిపాల్ కృష్ణారావు అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా అత్యాచారానికి ప్రయత్నించాడని, అతడిపై పోక్సో కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశాడు. మంగళవారం భీమవరం పట్టణానికి చెందిన జవ్వాది రమేష్ తన ఇద్దరు కుమారులను ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఏడాదికి రెండు లక్షలు చొప్పున ఫీజు కట్టే విధంగా ప్రిన్సిపాల్‌తో మాట్లాడుకుని ప్రతి ఏడాది ఫీజు కట్టినప్పటికీ తనకు ఏ విధమైన రసీదు ఇవ్వలేదన్నారు. రెండు నెలల క్రితం స్కూల్‌కి వెళ్లగా ప్రిన్సిపాల్ కృష్ణారావు తాడేపల్లిగూడెం భారతీయ విద్యాభవన్ స్కూల్‌కి చీఫ్‌గా ఉన్నానని, అందువల్ల పదో తరగతి ప్రశ్నపత్రం తనకు ముందు రోజు వస్తుందని, మీ అబ్బాయికి ఎక్కువ మార్కులు వచ్చేలా చేస్తానని, దానికి కొంత డబ్బులు కట్టాలని చెప్పగా దానికి ఒప్పుకోలేదన్నారు. ఈనెల 9న స్కూల్ పునఃప్రారంభం విషయాన్ని తెలుసుకుందామని స్కూల్‌కి వెళ్లగా ప్రిన్సిపాల్ రావడం లేదని, అంతేకాకుండా ఇప్పటివరకు మీ అబ్బాయికి సంబంధించిన ఫీజు కట్టలేదని యాజమాన్యం తెలిపిందన్నారు. తిరిగి వస్తుండగా ప్రిన్సిపాల్ ఎదురుకావడంతో ఫీజుకు సంబంధించి నిలదీయగా తనకు, స్కూల్‌కు ఏవిధమైన సంబంధం లేదని చేతనైన పని చేసుకోమని దురుసుగా ప్రవర్తించాడు. ఇద్దరి పిల్లల ఫీజుకు సంబంధించి ఐదేళ్లకు రూ.పది లక్షలు కట్టానని, ఫీజు డబ్బులు స్కూల్ యాజమాన్యానికి చెల్లించకుండా ప్రిన్సిపాల్ సొంతంగా వాడుకున్నట్టు తెలిసిందని, తగిన విచారణ జరిపి న్యాయం చేయాలని కలెక్టరుకు వినతి పత్రం అందజేశారు.

# కొత్తగా.. మరింత చేరువగా..



» ఉమ్మడి పశ్చిమ జిల్లాలో 9 రకాల బడులకు తుదిరూపు !

» ఇప్పుడున్న 2,921 ప్రభుత్వ పాఠశాలలన్నీ యథాతథం

**రెండు రోజుల్లోగా టీచర్ల సర్దుబాటు : డీఈవో**

ఏలూరు అర్బన్, మే 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను పునర్వ్యవస్థీకరిస్తూ పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు మంగళవారం విడుదల చేసిన జీవోలతో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తొమ్మిది రకాల బడులు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇప్పుడున్న 2,921 పాఠశాలల్లో ఏ ఒక్కటీ మూసేయకుండానే అన్నింటినీ కొనసాగిస్తూ కొత్త బడులను ప్రారంభిస్తుండడం విశేషం. విద్యాహక్కు చట్టం నిబంధనలకు లోబడి నూతన పాఠశాలలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ మేరకు గత కొన్ని నెలలుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో సదస్సులు, విస్తృత చర్చలు, సమావేశాలు, కూడికలు, తీసివేతల కసరత్తు తర్వాతే నూతన పాఠశాలలపై నిర్ణయానికి వచ్చారు. దీని కనుగుణంగానే పాఠశాలల్లో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను ప్రామాణికంగా తీసుకుని కొత్త బడులకు ఎస్టీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను హేతుబద్ధీకరణ విధానం ద్వారా సర్దుబాటుచేసే ప్రక్రియను దాదాపు ఓ కొలిక్కి తెచ్చేందుకు జిల్లా విద్యాశాఖ ముమ్మర కసరత్తుచేస్తోంది. కొత్త బడుల ఉత్తర్వులపై డీఈవో వెంకటలక్ష్మమ్మ మంగళవారం రాత్రి వివరణ ఇస్తూ 'నూతన బడులకు ఉపాధ్యాయుల సర్దుబాటు మరో రెండురోజుల్లో పూర్తవుతుంది. మొత్తంమీద టీచర్ల బదిలీల షెడ్యూలు విడుదలయ్యే నాటికి పాఠశాలల వారీగా సర్దుబాటు పూర్తిచేస్తాం.' అని వివరించారు.

### తొమ్మిది రకాల బడుల స్వరూపమిలా..

- **శాటిలైట్ ఫౌండేషనల్ స్కూలు..** పూర్వ ప్రాథమిక విద్య పీపీ-1, పీపీ-2 (ఎల్‌కేజీ, యూకేజీ) బోధి స్తారు. ప్రస్తుతమున్న ప్రాథమిక పాఠశాలకు ఒక కిలోమీటరు దూరంలోపు ఇవి ఏర్పాటవుతాయి. అంగన్‌వాడీ వర్కర్లు బోధిస్తారు. ఉమ్మడి జిల్లాలో పూర్వ ప్రాథమికవిద్య పాఠశాలల సంఖ్యను మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ సంస్థ నిర్ధారించాల్సిఉంది.
- **ఫౌండేషనల్ స్కూలు..** పీపీ-1, పీపీ-2తోపాటు ఒకటో తరగతి, రెండో తరగతి బోధిస్తారు. ఉపాధ్యాయ, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ 1:30 నిష్పత్తికి ఒక ఎస్టీటీ.. 31:60 నిష్పత్తికి ఇద్దరు ఎస్టీటీలు ఉంటారు. పూర్వ ప్రాథమికవిద్య తరగతులకు అంగన్‌వాడీ వర్కర్లే బోధిస్తారు. ఉమ్మడి జిల్లాలో ఇవి గడచిన విద్యాసంవత్సరం (2024-25)లో 164ఉండగా, వచ్చే జూన్‌నుంచి ప్రారంభమయ్యే 2025-26 విద్యాసంవత్సరంలో మరింత వికేంద్రీకరించి 315 ప్రారంభించాలని నిర్ణయించారు.
- **బేసిక్ ప్రైమరీ స్కూలు..** పీపీ-1, పీపీ-2లతోపాటే, ఒకటో తరగతి నుంచి ఐదో తరగతి వరకు బోధిస్తారు. విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ ఆధారంగా ఎస్టీటీ కేడర్ ఉపాధ్యాయపోస్టులను నిర్ణయించారు. గత విద్యాసంవత్సరం వరకు ఫౌండేషనల్ ప్లస్ స్కూళ్లుగా పిలిచిన ఈ స్కూళ్లను ఇపుడు బేసిక్ ప్రైమరీ పాఠశాలలుగా నామకరణం చేశారు. దీనికనుగుణంగానే గతంలోవున్న 2,147 ఫౌండేషనల్ ప్లస్ పాఠశాలల సంఖ్యను స్థానిక అవసరాలకు అనుగుణంగా కుదించి ఉమ్మడి జిల్లాలో 1508 బేసిక్ పాఠశాలను ఏర్పాటుచేయనున్నారు.
- **మోడల్ ప్రైమరీ స్కూలు..** గత ప్రభుత్వంలో ప్రైమరీ స్కూళ్లనుంచి బలవంతంగా 3, 4, 5 తరగతులను సమీప 186 హైస్కూళ్లకు తరలించి ఏర్పాటు చేసిన ప్రీహైస్కూళ్ల నుంచి నిర్వహించగా, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు హైస్కూళ్లకు తరలించిన ప్రాథమిక తరగతులను మళ్లీ పూర్వపు ప్రాథమిక పాఠశాలలకే వెనక్కిరప్పించి, వాటికి కొన్నింటిని అదనంగాచేర్చి అన్ని వసతులతో కొత్తగా ఏర్పాటు చేస్తున్న పాఠశాలలే మోడల్ ప్రైమరీ స్కూళ్లు. ఉమ్మడి జిల్లాలో ఈ పాఠశాలలు 528 ఏర్పాటవుతున్నాయి. వీటికి హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులను, ప్రతీ ప్రాథమిక తరగతికి ఒక ఎస్టీటీని నియమిస్తారు.
- **అప్పర్ ప్రైమరీ స్కూలు..** పీపీ-1, పీపీ-2లతోపాటు ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు బోధిస్తారు. బీపీఎస్/ఎంపీఎస్ మార్గదర్శకాల మేరకు టీచర్ల నియామకం ఉంటుంది. గతంలో 3 నుంచి 10వ తరగతి వరకు, 3 నుంచి 12వ తరగతి వరకు బోధించడానికి ప్రారంభించిన 159 రెండు రకాల హైస్కూళ్లను సంస్కరించి, వాటిస్థానే 84 ప్రాథమికోన్నత పాఠశాలలను ప్రారంభించనున్నారు. వీటిలో ఎస్టీటీలు, స్కూల్ అసిస్టెంట్ కేడర్ టీచర్లు బోధిస్తారు.
- **హైస్కూలు..** గతంలో వున్న 255 ఉన్నత పాఠశాలలను సంస్కరించి, తాజాగా 6 నుంచి 10వ తరగతి వరకు, 6నుంచి 12వ తరగతి వరకు స్కూల్ అసిస్టెంట్ కేడర్ ఉపాధ్యాయులతో బోధించేందుకు ఉమ్మడి జిల్లాలో 391 రెండు రకాల హైస్కూళ్లను ప్రారంభిస్తున్నారు.
- **హైస్కూలు ప్లస్..** బీపీఎస్ స్కూల్.. (బేసిక్ ప్రైమరీ స్కూలు) కలిపి ఒకే ప్రాంగణంలో ఒకటి నుంచి పదో తరగతి వరకు/ ఒకటో తరగతినుంచి 12వ తరగతి (ఇంటర్‌విద్య)వరకు బోధించేందుకు ఉమ్మడి జిల్లాలో మొత్తం 41 పాఠశాలలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. గతంలో వున్న 10హైస్కూళ్ల(1-10తరగతులు)స్థానే నూతన విధానంలో 41 పాఠశాలలను ప్రారంభిస్తున్నారు.
- **మోడల్ ప్రైమరీ స్కూలు, హైస్కూలు ప్లస్..** ఒకే ప్రాంగణంలో ఒకటనుంచి పదో తరగతి వరకు లేదా ఒకటి నుంచి 12వ తరగతి వరకు బోధించేలా రెండు ప్యాటర్న్లలో ఉమ్మడి జిల్లాలో 54 పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు.

# ఆకస్మిక విపత్తులపై మాక్ డ్రిల్

ఏలూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాలు, అగ్ని ప్రమాదాలు, వరదలు వంటి సంక్షోభాలను ఎదుర్కోవడంతోపాటు పరిసర ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసి అవగాహన కల్పించేందుకు మాక్‌డ్రిల్ ఉపయోగపడుతుందని ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మంగళవారం ఏలూరు కలెక్టరేట్‌లో అనుకోని విపత్తులు సంభవించినప్పుడు ఎదుర్కొనేందుకు ఉద్యోగులు, ప్రజల్లో అవగాహన తీసుకువచ్చేందుకు సంబంధిత శాఖలు మాక్‌డ్రిల్ నిర్వహించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాక్‌డ్రిల్ నిర్వహణ వల్ల విపత్తు సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలు గందరగోళానికి గురికాకుండా త్వరగా స్పందించగలరన్నారు. అగ్నిమాపక సేవలు, ఎస్డీఆర్ఎఫ్, పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ, శిక్షణ పొందిన ఆపదమిత్ర వలంటీర్లు, ఎన్‌సీసీ, విద్యుత్‌శాఖ, తదితర బహుళ విభాగాలు మాక్‌డ్రిల్‌లో పాల్గొన్నాయి. కలెక్టరేట్ పైఅంతస్తులో అగ్నిప్రమాదం సంభవించింది అనే అంశంపై అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరరావు, జిల్లా ఫైర్ ఆఫీసర్ సీహెచ్ రత్నబాబు, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ పి.సాల్మన్‌రాజు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్‌కుమార్, డాక్టర్ రాజీవ్, ప్రభాకర్, ఆర్‌వి నాగరాణి, నాంచారయ్య, జి.శేషగిరి, కలెక్టరేట్ సిబ్బంది, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, తదితరులు పాల్గొన్నారు.





ఏలూరు కలెక్టరేట్ నుంచి కిందికి దించుతున్న ఫైర్ సిబ్బంది.. అంబులెన్స్ వద్దకు తీసుకొస్తున్న దృశ్యం



వైద్యం చేస్తున్న డాక్టర్లు చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి



డాగ్ స్క్వాడ్



దెందులూరులో గ్యాస్ పైప్‌లైన్ వద్ద మాక్ డ్రిల్

### దెందులూరులో గ్యాస్ పైప్‌లైన్ లీకేజీలపై..

దెందులూరు,మే 13 (ఆంధ్రజ్యోతి) : 'రాష్ట్రంలో అతిపెద్ద గ్యాస్ పైప్ లైను 1,375 కిలోమీటర్ల పొడవైన కాకినాడ నుంచి దెందులూరు మీదుగా గుజరాత్ రాష్ట్రం వెళ్లిన నేపథ్యంలో ఎక్కడైనా గ్యాస్ లీకేజీ అయితే తీసుకోవాల్సిన చర్యలపై' జాతీయ విపత్తు స్పందన దళం, ఎన్‌డీఆర్ఎఫ్ పది బెటాలియన్, పైప్‌లైన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ సంయుక్త ఆధ్వర్యంలో భారీ మాక్ డ్రిల్ నిర్వహించారు. మంగళవారం దెందులూరు రాజా రైస్ మిల్లు సమీపంలో రాష్ట్ర డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆర్.త్రినాథరావు, పర్యావరణ పరిరక్షణ అధికారి కె.వెంకటేశ్వ రావు, రవాణాశాఖ అధికారి కల్యాణి, పలు కీలక శాఖల అధికారుల ఆధ్వర్యంలో 300మందితో భారీ మాక్ డ్రిల్ నిర్వహించారు. అనంతరం ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని దెందులూరు గ్రామ సర్పంచ్ తోట యేసమ్మ, తహసీల్దార్ బత్తుల సుమతి ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో మండల, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# వేర్వేరుచోట్ల ఆరుగురి మృతి

**క్రైమ్ కార్నర్**

**ఏలూరు జిల్లాలో వేర్వేరుచోట్ల మంగళవారం మొత్తం ఆరుగురు మృతి చెందారు. భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదని ఇద్దరు.. డ్రెయినేజీలో పడి మాదేపల్లి వాసి ఒకరు.. రైలు నుంచి జారిపడి చికిత్స పొందుతూ మహిళ.. భార్యాభర్తల గొడవల నేపథ్యంలో పురుగుల మందు తాగి మరో మహిళ.. కడుపునొప్పి తాళ మరో మహిళ మొత్తం ఆరుగురు మృతి చెందారు.**

### ఒంటరితనాన్ని భరించలేక ఆత్మహత్య



శ్రీను మృతదేహం

ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : ఒంటరితనాన్ని భరించలేక ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పెదవేగి మండలం అంకన్నగూడెం గ్రామానికి చెందిన పల్లెపాముల శ్రీను(34) అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. అతడి భార్య పుట్టింటికి వెళ్లి రావడం లేదు. భార్య రావడం లేదని మరింత ఎక్కువగా మద్యం తాగుతున్నాడు. ఒంటరి తనాన్ని భరించలేక జీవితంపై విరక్తి చెంది మంగళవారం మధ్యాహ్నం తన ఇంట్లో ఉరి వేసుకుని వేలాడుతుండగా చుట్టుపక్కల వారు చూసి వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. ఆసుపత్రి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు.

### పుట్టింటి నుంచి భార్య రావడం లేదని ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, మే 13(ఆంధ్రజ్యోతి):మద్యానికి బానిసైన భర్తలో మార్పు రాకపోవడంతో తన ఇద్దరు పిల్లలతో పుట్టింటికి వెళ్లిన భార్య తిరిగి రాకపోవడంతో మనస్తాపం చెందిన భర్త రాజులపాటి అప్పారావు (36) మంగళవా రం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హెచ్‌సీ ఎస్. ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాలివి.. మండలంలోని శ్రీనివాస పురంలో చికెన్ షాపు పెట్టుకుని జీవనం సాగిస్తున్న అప్పారావుకు అక్కంపేటకు చెందిన ప్రియాంకతో పన్నెండేళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. అతడు నిత్యం మద్యం సేవిస్తూ భార్యతో గొడవలు పడుతూ ఉండేవాడు. అనేకసార్లు పెద్దలలో పెట్టి మద్యం మానేయాలని చెప్పినా వినలేదు. ఎంతచెప్పినా భర్తలో మార్పు రాకపోవడంతో పదిహేను రోజుల క్రితం అతడి భార్య తన ఇద్దరి పిల్లలతో పుట్టింటికి వెళ్లింది. భర్త అనేకసార్లు ఫోన్ చేసి ఇంటికి రమ్మని చెప్పినా రావడం లేదని మనస్తాపం చెంది ఇంట్లోనే ఉరి వేసుకుని మృతిచెందాడు. మృతుడు తన స్నేహితుడికి ఈ విషయాన్ని ఫోన్ చేసి చెప్పాడని తెలిపారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెచ్‌సీ తెలిపారు.

### డ్రెయినేజీలో పడి ఒకరు..

ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి) : అతిగా మద్యానికి బానిసై ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి గ్రామా నికి చెందిన వల్లూరు వెంకటేశ్వరరావు(52) తాపీ పనులు చేస్తూ ఉంటాడు. భార్య పిల్లలు ఉన్నారు. అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. ఈనెల 12వ తేదీ ఏలూరు గజ్జలవారి చెరువు గోడపక్కన పూటుగా మద్యం తాగి ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మృతి చెందాడు. ఈ సమాచారం మంగళవారం ఉదయం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు అందడంతో ఎస్ఐ మదీనా బాషా తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### రైలు నుంచి జారిపడి మహిళ..

రైలులో ప్రయాణిస్తున్న ఒక మహిళ ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. తూర్పు గోదావరి జిల్లా రాజానగరం మండలం కలకచర్ల గ్రామానికి చెందిన బొమ్మెతి కుమారి(40) హైదరాబాద్‌లో ఉన్న తన చెల్లిని చూడడానికి ఈనెల 12వ తేదీ రాత్రి తన తల్లిదండ్రులతో కలిసి ద్వారపూడిలో గౌతమి ఎక్స్‌ప్రెస్ రైలు లేడీస్ కంపార్టుమెంట్ ఎక్కారు. రైలులో ప్రయాణిస్తుండగా ఏలూరు సమీపంలోని సత్రంపాడు వద్ద ప్రయా ణికుల రద్దీ ఉండడం వల్ల బోగి గుమ్మంలో ఉన్న ఆమె ప్రమాదవ శాత్తు జారిపడి తీవ్ర గాయాలకు గురైంది. 108 అంబులెన్సులో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా చికిత్స పొందుతూ మంగళ వారం ఉదయం మృతి చెందింది. ఈ ఘటనపై ఏలూరు రైల్వే ఎస్ఐ పి.సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

### చికిత్స పొందుతూ మహిళ..

భార్యాభర్తల మధ్య గొడవలతో తీవ్ర మనస్తాపానికి గురై ఒక మహిళ పురుగుల మందు తాగి విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందింది. ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామానికి చెందిన కటారి చిననాగలక్ష్మి(19)కి భర్త చినకొండ ఉన్నారు. అతడి వేధింపులు భరించలేక ఈ ఏడాది ఏప్రిల్ 24న గడ్డి నివారణ మందుతాగి అప్పటి నుంచి తీవ్ర అస్వస్థతకు గురై విజయవాడ ప్రభుత్వాసుప త్రిలో చికిత్స పొందుతుంది. మంగళవారం మృతి చెందింది.

### కడుపునొప్పి తాళలేక మరొకరు..

పెదవేగి, మే 13(ఆంధ్రజ్యోతి) : దీర్ఘకాలంగా వస్తున్న కడుపునొప్పి తాళలేక వివాహిత మహిళ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. జానంపేటకు చెందిన నున్నా కిశోర్, ఏసమ్మ(38) భార్యాభర్తలు గ్రామంలోని ఓ రైతు దగ్గర కమతం ఉంటున్నారు. ఏసమ్మ కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతోంది. ఈ క్రమంలో సోమవారం ఉదయం కిశోర్ పనికి వెళ్లగా ఆమెకు తీవ్రంగా కడుపునొప్పి రావడంతో పురుగుల నివారణకు తీసుకొచ్చిన మందును తాగేసి, భర్తకు ఫోన్‌చేసి విషయం చెప్పింది. వెంటనే ద్విచక్రవాహనంపై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# ముగ్గురికి తీవ్ర గాయాలు

**పిట్టలను కొట్టే మందు గుండు పేలి**

రామవరంలో ఘటన.. క్షతగాత్రులు తమిళనాడు యువకులు



గాయాలపాలైన పవన్‌చరణ్, మరో వ్యక్తి

కైకలూరు, మే 13(ఆంధ్రజ్యోతి): ఆక్వా చెరువులపై పిట్టలను కొట్టేందుకు వినియోగించే మందుగుండు సామగ్రి పేలి ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలైన ఘటన కైకలూరు మండలం రామవరంలో మంగళవారం ఉదయం జరిగింది. వివరాలివి.. ఇరవై రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొంతమంది చేపల, రొయ్యల చెరువులపై పక్షులను బెదరకొట్టేందుకు కూలిపని చేసుకునేందుకు గ్రామానికి వచ్చారు. అదే గ్రామంలో ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. మణి సతీష్, కాంతపు మణి ఇరువురు ఇంటిలోని నాటు తుపాకీకి వినియోగించే మందు కలుపుతుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ నిద్రిస్తున్న పవన్‌చరణ్‌తో సహా ముగ్గురుకి తీవ్రగాయాలయ్యాయి. వీరిలో ఒక బాలుడు కూడా ఉన్నాడు. భారీగా పేలుడు శబ్దం వినిపించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. కొంతమంది స్థానికులు ఆ ఇంటికి చేరుకుని ముగ్గురు యువకుల గాయాలను చూసి చలించిపోయారు. 108 ద్వారా వారిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి తమిళనాడు రాష్ట్రానికి చెందిన కృష్ణగిరి జిల్లా ఉత్తంగర్ మండలం వెల్లగుట్ట గ్రామానికి చెందిన మణిసతీష్, ఫ్రాన్స్ జిల్లా పాండిచ్చేరి గ్రామం నరీవర్ కాలనీకి చెందిన కాంతపు మణి, వీరిద్దరిని మెరుగైన చికిత్స కోసం ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తిరుమలై గ్రామానికి చెందిన పదిహేనేళ్ల బాలుడు పవన్‌చరణ్‌కు కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వీరి ముగ్గురికి చేతులు, కాళ్ళు, ముఖాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ట్రాక్టరు ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి

**పాడె మోసిన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్**

పెదవేగి, మే 13(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం అమ్మపాలెం సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పెదవేగి ఎస్ఐ కె.రామకృష్ణ తెలిపిన వివరాలివి.. భోగాపురం గ్రామానికి చెందిన మట్టా నాగరాజు(36) మంగళవారం ఉదయం గ్రామం సమీపంలోని హైవే సర్వీసు రోడ్డులో వాకింగ్ వెళ్తున్నాడు. అదే సమయంలో వెనుకనుంచి వచ్చిన ట్రాక్టర్ అదుపు తప్పి అతడిని ఢీకొట్టగా అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై వీఆర్వో శ్రీనివాసరావు ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

### పాడె మోసిన ఎమ్మెల్యే చింతమనేని..

పార్టీకి కార్యకర్తలే బలమని, కష్టాల్లో ఉన్న కార్యకర్తల కుటుంబాలకు అన్నివిధాల ఆదుకుంటామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. రోడ్డు ప్రమాద సమాచారం తెలుసుకుని నాగరాజు మృతదేహానికి నివాళులర్పించి, బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. అతడి మృతదేహంపై పార్టీ జెండా కప్పి గ్రామంలో ఊరేగించారు. అతడి మృతదేహాన్ని శ్మశాన వాటికవరకు ఎమ్మెల్యే చింతమనేని పాడె మోశారు. అనంతరం శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామంలో విషాదం నెలకొంది.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ (ఇన్‌సెట్‌లో) నాగరాజు (ఫైల్)

# ఇంజన్ వేడెక్కి పగిలిన ఆటో రేడియేటర్

» శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఘటన » వేడినీరు పడి పలువురికి గాయాలు

ద్వారకాతిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయ జంటగోపురాల వద్ద క్షేత్రదర్శనానికి వచ్చిన ఓ భక్తుని టాటాఏస్ ఆటోలోని రేడియేటర్ పగిలిన ప్రమాద ఘటన జరిగింది. వివరాలివి.. దెందులూరు మండలం పోతునూరుకు చెందిన ఓ భక్తుని కుటుంబం శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి వచ్చారు. జంట గోపురాల వద్దకు వచ్చేసరికి ఇంజన్ బాగా వేడెక్కి ఒక్కసారిగా పొగలువచ్చాయి. రేడియేటర్ బద్ధలై వేడినీరు లోపల కూర్చున్న వారిపై పడ్డాయి. పొగలు కమ్మడంతోపాటు ఆటో డోర్‌లు తెరుచుకోక పోవడంతో అక్కడి సెక్యూరిటీ, ఇతరులు డోర్‌లను పగులకొట్టి లోపలున్నవారిని బయటకు తీశారు. వారిలో పలువురికి వేడి నీరుపడి గాయాలయ్యాయి. ఓ బాలుడిపై వేడినీరు ఎక్కువగా పడి కాలుపై తోలు ఊడడంతో స్థానిక పీహెచ్‌సీకి చికిత్స నిమిత్తం తరలించారు.




**IN THE COURT OF III ADDITIONAL DISTRICT JUDGE : BHIMAVARAM.**
A.S.No.**31/2024**
Between:
**1.KANDIKATLA LAZAR@ BULLIAH (DIED) & ANR** ..Appellant
and
**1.KANDIKATLA YOHAN(DIED)& 11 Ors** ..Respondents
***11th Respondent Address*** : R-11 Jalli Suhashini W/o. Ganesh Prasad D/o. Late Kandikatla Chanti Babu,D.No.11-13-27, K.K. Street, 12th ward, Gunupudi,Bhimavaram-1
మీపై దాఖలు చేసిన అప్పీల్ లో మీరు 11వ రెస్పాండెంట్ అయ్యియుండి కోర్టు వారు జారీ చేసిన నోటీసులు తీసుకోనకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నందున ది.11.07.2025 సం॥రం తేది ఉదయం 10.30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి మీ వాదన తెలియజేసుకొనగలరు. లేని యెడల మీ పరోక్షమున కోర్టు వారు తదుపరి ఉత్తర్వులు జారీ చేయుదురు.
Advocate for Petitioner
**Vundavalli Satyanarayana Murthy**
B.Com.I.R.P.M., B.L.,
Advocate,Bhimavaram -1
Bhimavaram
12.05.2025

## నేడు మోడల్ డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష

పెదపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ పరీక్షపై అవగాహనకు మోడల్ ఆన్‌లైన్ పరీక్షను పెదపాడు మండలం వట్లూరులోని సర్ సీఆర్‌రెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ఉదయం 9.30 గంటలకు నిర్వహిస్తున్నట్టు చింతమనేని చారిటబుల్ ట్రస్ట్ ఒక ప్రకటనలో తెలిపింది. మరిన్ని వివరాల కు 99125 57433, 85559 65407 నెంబర్లలో సంప్రదించాలని, అభ్యర్థులకు పరీక్షా కేంద్రం వద్ద భోజన సౌకర్యం ఉంటుందన్నారు.

## నేడు, రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పెదవేగి, మే 13(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం రామశింగవరం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా రెండు రోజుల పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎస్ ఏలూరు ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. ఈ కారణంగా రామశింగవరంతోపాటు తాళ్లగోకవరం, ఆసన్నగూడెం గ్రామాల పరిధిలో బుధ, గురువారం రెండు రోజులపాటు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## స్పందించారు

### డ్రెయినేజీ పూడికతీత.. చెత్త తొలగింపు



జంగారెడ్డిగూడెం పట్టణంలోని నాలుగో వార్డు ఇందిరానగర్ ప్రధాన డ్రైనేజీని శుభ్రపరచిన దృశ్యం







కొవ్వూరు రోడ్డులోని శ్మశానవాటిక ఎదురుగా చెత్తను తొలగించిన దృశ్యం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జంగారెడ్డిగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాలుగో వార్డులో డ్రెయినేజీ సమస్యపై, అదే వార్డులోని శ్మశాన వాటిక ఎదురుగా ఉన్న ప్రధాన రహదారి పక్కన చెత్త తొలగించాలని మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'పట్టించుకునే నాథుడే కరువు' శీర్షికన ప్రచురితమైన కథనానికి మున్సిపల్ కమిషనర్ స్పందించారు. ఎక్స్‌కవేటర్లతో డ్రైనేజీలో మురుగు, పిచ్చిమొక్కలను తొలగించారు. అలాగే రోడ్డు పక్క ఉన్న చెత్తను తొలగించారు. అధికారులు స్పందించిన తీరుకు నాల్గోవార్డు కౌన్సిలర్ వలవల తాతాజీ, ఇందిరా నగర్ కాలనీ ప్రజలు 'ఆంధ్రజ్యోతి'కి కృతజ్ఞతలు తెలిపారు.

## పేద విద్యార్థులకు వల్లూరి ట్రస్ట్ చేయూత


రూ.5 లక్షల చెక్కు అందిస్తున్న వల్లూరి వెంకటకృష్ణయ్య దంపతులు

పెదపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరిస్తానని పెదపాడు మండలం నాయుడుగూడేనికి చెందిన వల్లూరి సుష్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వల్లూరి వెంకట కృష్ణయ్య తెలిపారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న ఆర్థికంగా వెనుకబడిన డి.కరుణ, కె.లోకేష్‌ల చదువుల నిమిత్తం రూ. 5 లక్షలను ఆ పాఠశాల ప్రతినిధికి మంగళవారం అందజేశారు. వల్లూరి సుభద్రాదేవి, ఎంఈవో దేవినేని వెంకటరమణ పాల్గొన్నారు.

## 'పాఠశాలల పునర్వ్యవస్థీకరణతో తిరోగమనమే'

ఏలూరు అర్బన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : గత ప్రభుత్వం అమలుచేసిన జీవో 117 ఉత్తర్వుల వల్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం కాగా, ప్రస్తుత ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన జీవో 19 నిబంధనలతో ఏర్పాటయ్యే 9 రకాల బడుల వల్ల మొత్తం ప్రభుత్వ పాఠశాలలు పూర్తిగా తిరోగమనం చెందటం ఖాయమని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర ఆరోపించారు. తాజా ఉత్తర్వుల ప్రభావం తో మరింతమంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల నుంచి ప్రైవేటు పాఠ శాలల వైపు తరలిపోతారని, ఉపాధ్యాయులపైనా పనిభారం పెరుగుతుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలంటే పూర్వపువిధానం మాదిరిగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలలవ్యవస్థే సరైందని పేర్కొన్నారు. అసంబద్ధ పునర్వ్యవస్థీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 14న విజయవాడలో రాష్ట్రస్థాయి ధర్నాను చేపట్టనున్నామని తెలిపారు.

## సైనికులకు ఆత్మస్థైర్యం కలిగించాలని పూజలు


పూజలు చేస్తున్న రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించాల్సిన అవసరం ఉం దని ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, జనసేన ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు పేర్కొన్నారు. భారత సైనికులకు ఆత్మస్థైర్యం కలిగించాలని కోరుతూ ఏలూరు పోస్టల్ కాలనీలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి ఆలయంలో మంగళవారం పూజలు చేశారు. జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, జనసేన నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీనరేష్, ప్రధాన కార్యదర్శి సదిరి రాజేష్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## గార్డు డ్యూటీ పోలీసులకు కూలర్ల అందజేత



కూలర్‌ను సిబ్బందికి అందిస్తున్న ఎస్పీ

ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): పోలీస్ సిబ్బంది సంక్షేమం పట్ల ప్రత్యేక శ్రద్ధ చేపట్టామని అందులో భాగంగా వేసవి తీవ్రత దృష్ట్యా ఆర్మ్డు రిజర్వు విభాగంలో గార్డు డ్యూటీ నిర్వహిస్తున్న సిబ్బందికి కూలర్లను అందించినట్లు ఎస్పీ కిషోర్ చెప్పారు. జిల్లాలో ఆర్మ్డు రిజర్వుడు పోలీసులు వివిధ గార్డు డ్యూటీలు నిర్వహిస్తున్నారు. వీరి ఆరోగ్య సంరక్షణ దృష్ట్యా ఎస్పీ ప్రత్యేక చర్యలు చేపట్టి రూ. 91 వేల విలువైన 13 కూలర్లను కొనుగోలు చేసి గార్డు డ్యూటీచేసే వారికి అందించినట్లు తెలిపారు. ఎఆర్ఆర్ఐ పవన్‌కుమార్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## కారుణ్య నియామకం


నియామక పత్రం అందజేస్తున్న పెదబాబు

ఏలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరపాలక సంస్థలో కారుణ్య నియామకాలు చేపట్టారు. దీనిలో భాగంగా స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) విధులు నిర్వహిస్తూ మరణించిన అరవ సుష్మకుమారి కుమారుడు గూడ దేవాశిష్ కిరణ్‌ను పార్కు గార్డెనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మరణించిన దుర్గాసి సుధాకర్ భార్య జాహ్నవికి రూ. 2 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్కును నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు, మున్సిపల్ కమిషనర్ ఎ. భాను ప్రతాప్ అందజేశారు. అదనపు కమిషనర్ జి. చంద్రయ్య, మేనేజర్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన

టి.నర్సాపురం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకంలో కూలీలకు అడిగిన వెంటనే పని కల్పిస్తామని మండల అభివృద్ధి అధికారి మణికుమారి తెలిపారు. మంగళవారం బందంచర్లలో ఉపాధి కూలీలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి సమస్యలడిగి తెలుసుకున్నారు. అన్ని పని ప్రదేశాల్లో కూలీలకు తాగునీరు, పందిళ్లు, ప్రథమ చికిత్స మందులు ఉంచామని ఆమె తెలిపారు. మండలం మొత్తం ఒకరోజుకు 3వేల పనిదినాలు నమోదవుతున్నట్లు ఆమె తెలిపారు.

## ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



పోలవరం మే 13 (ఆంధ్రజ్యోతి): పోలవరంలో స్థానిక బస్ షెల్టర్ వద్ద రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జానపద కళాజాత బృందం మంగళవారం ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన కార్యక్రమం నిర్వహించింది. పాటలు, మాటల రూపకంలో ఎయిడ్స్ నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. జానపద కళాకారులు కళా కృష్ణ, యడ్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలి



బుట్టాయగూడెం, మే 13(ఆంధ్రజ్యోతి): గిరిజన సలహా మండలిని వెంటనే ఏర్పాటు చేయాలని, షెడ్యూల్డు ప్రాంతంలో ఉద్యోగ నియామకాల చట్టం చేయాలని, ఏజెన్సీకి ప్రత్యేక డీఎస్సీని ప్రకటించాలని ఆదివాసీ ఐక్య కార్యాచరణ కమిటీ చైర్మన్ మొడియం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. మంగళవారం బూసరాజుపల్లిలో కమిటీ అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీ ప్రాంత ఉద్యోగాలు స్థానిక ఆదివాసీలతో భర్తీ చేస్తున్నట్లు ప్రకటించిన సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు రాష్ట్రంలోని అన్ని ఐటీడీఏల వద్ద ఆదివాసీ జేఏసీ పిలుపు మేరకు రిలే దీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. నాయకులు సోదెం ముక్కయ్య, తెల్లం లక్ష్మణరావు, తెల్లం రవిప్రసాద్, పి.రాములు, సరియం నాగేశ్వరావు, సోదెం రాజు, టి.గంగరాజు, కె.కృష్ణంరాజు, ఆర్.బసవరాజు, పి.కొవ్వాడయ్య, కె.వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## కోరిన వారందరికీ ఉపాధి : కలెక్టర్


ఉపాధి కూలీతో మాట్లాడుతున్న కలెక్టర్

దెందులూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా పనికోరిన వారందరికీ పని కల్పించాలని, ఉపాధి సిబ్బంది రికార్డులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఉపాధి అధికారులను ఆదేశించారు. దెందులూరు మండలం సానిగూడెం పరిధిలో రూ.25 లక్షల వ్యయంతో సాగునీటి అవసరాలకు ఉపయోగపడే 68 ఎకరాల కొత్త చెరువు నిర్మాణ పనులను మంగళవారం పరిశీలించారు. పనిచేసే ప్రదేశంలో కూలీలకు తాగునీరు, మజ్జిగా వంటివి అందించాలని ఉపాధి అధికారులకు కలెక్టర్ సూచించారు. రైతులకు, గ్రామాలకు ఉపయోగపడే పనులు చేపట్టాలన్నారు. ఆర్డీవో అచ్యుత్ అంబరీశ్, డ్వామా పీడీ సుబ్బారావు, తహసీల్దార్ సుమతి, ఎంపీడీవో శ్రీదేవి, ఉపాధి ఏపీవో ఫాతిమా ప్రసన్న, మాజీ సర్పంచ్ యలమర్తి శ్రీనుబాబు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్రీడాభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే చంటి


స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): క్రీడారంగంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గాన్ని ప్రథమ స్థానంలో నిలిపేందుకు సహకరిస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి హామీ ఇచ్చారు. ఏలూరు ఇండోర్ స్టేడియంలో క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న సమ్మర్ కోచింగ్ క్యాంప్‌లో శిక్షణ పొందు తున్న వారికి క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేశారు. డీఎస్‌డీవో బి. శ్రీనివాస్, ఒలింపిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బడేటి వెంకటరామయ్య, ఏఎంసీ చైర్మన్ పార్ధసారథి తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెన్నకు గన్ని కృతజ్ఞతలు


మంత్రి అచ్చెన్నను సత్కరిస్తున్న గన్ని

భీమడోలు, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆప్కాబ్ చైర్మన్‌గా తనను నియమించినందుకు గన్ని వీరాంజనేయులు మంగళవారం నాడు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే టీడీపీ పార్టీ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీను గన్నిని కలిసి అభినందించారు. భీమడోలు క్యాంపు కార్యాలయంలో డీసీఎంఎస్ చైర్మన్ మురళీకృష్ణ, జడ్పీచైర్మన్ పద్మశ్రీ ప్రసాద్ గన్నిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

### ఎమ్మెల్యే చింతమనేని


అధ్యక్ష, కార్యదర్శులను అభినందిస్తున్న ఎమ్మెల్యే

పెదపాడు, మే 13 (ఆంధ్రజ్యోతి): నాయకులంతా సమన్వయంతో పనిచేసి పార్టీని మరింత బలోపేతం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. టీడీపీ పెదపాడు మండల అధ్యక్ష, కార్యదర్శుల ఎంపిక మంగళవారం జరిగింది. అధ్యక్షుడిగా మరడాని రవి, కార్యదర్శిగా వేగుంట సురేష్ ఎన్నిక కాగా, వీరిని ఎమ్మెల్యే అభినందించారు. గారపాటి రామసీత, గారపాటి స్టాలిన్, ఉప్పలపాటి రాంప్రసాద్, బొప్పుడి కాశీబాబు, గుత్తా అనిల్, మోరు శ్రావణి, అక్కినేని వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి : ఎమ్మెల్యే రోషన్

చింతలపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): చింతలపూడి నియోజకవర్గంలో మంజూరైన రోడ్లు, వంతెనల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మంజూరైన కోట్ల రూపాయల నిధులతో చేపట్టే పనులు నత్తనడకగా సాగుతున్నాయని, వాటిని వేగవంతం చేయాలన్నారు. రోడ్లు, భవనాల శాఖ ఎస్ఈ భరత రత్నం, ఈఈ కిషోర్‌బాబు, డీఈ శ్రీనివాస్, ఏఈ సొంగా సుందరరావు, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ, కూటమి నాయకులు జె.ముత్తారెడ్డి, వరప్రసాద్, సాయల సత్యనారాయణ, చలపతిరావు, మాటూరి వెంకట్రామయ్య, దాసరి చంద్రశేఖ పాల్గొన్నారు.

## సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

**లింగపాలెం:** అర్హులైన ప్రతి నిరుపేదకు రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను తప్పనిసరిగా అందిస్తామని ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అన్నారు. అన్నపునేనివారిగూడెంలో స్థానిక నాయకులతో కలసి దొడ్డిగర్ల సురేశ్‌కు రూ. 65 వేలు, దొడ్డిగర్ల రవిత్రివేణికి రూ. 33వేల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను అందజేశారు. అనంతరం తొమ్మండ్రు గూడెంలో బిషప్ పొలిమెర జయరావుతో కలసి మేరీమాత చర్చ్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

## ఎక్సైజ్ దాడులు

### సారా స్వాధీనం.. ఊట ధ్వంసం

చింతలపూడి, మే 13 (ఆంధ్రజ్యోతి): నాగిరెడ్డిగూడెంలో సారా స్థావరంపై చింతలపూడి ఎక్సైజ్ అధికారులు దాడులు జరిపారు. గ్రామానికి చెందిన భూక్య శివ, భూక్య శ్రీనుకు చెందిన 1100 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని నిందితులపై కేసు నమోదు చేశారు. అలాగే హెచ్.భారతి నుంచి సారా స్వాధీనం చేసుకుని సారా సరఫరా చేసిన నామవరం గ్రామంలోని భూక్యా చిలకమ్మకు సంబంధించి 50 లీటర్ల ఊటను ధ్వంసం చేసి రెండు లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఆమెపై కేసు నమోదు చేసినట్టు ఎక్సైజ్ సిఐ పి.అశోక్ తెలిపారు.

## బాల్య వివాహ రహిత రాష్ట్రమే ధ్యేయం


ద్వారకాతిరుమల అంగన్వాడీలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): కిశోరి వికాసం-2లో భాగంగా ద్వారకాతిరుమల అంగన్వాడీ సెంటర్‌లో మంగళవారం కిశోర బాలికలకు బాల్య వివాహ చట్టం, విద్యాహక్కు, బాల కార్మిక నిర్మూలన సవరణ చట్టం వంటి పలు చట్టాలపై అవగాహన కల్పించారు. అలాగే బాలల హక్కుల రక్షణకు పోక్సో చట్టం పట్ల మహిళా పోలీస్ పి లక్ష్మీసుజన అవగాహన పెంపొందించారు. పిల్లలపై లైంగికదాడికి పాల్పడిన వ్యక్తికి విధించే శిక్ష ఇతర అంశాలపై వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి మేరీ మాట్లాడుతూ బాల్యవివాహాలు అనర్థదాయక మన్నారు. అనంతరం అందరితో బాల్య వివాహరహిత రాష్ట్రం కోసం ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

**కామవరపుకోట:** ఉప్పలపాడు గ్రామ సచివాలయ పరిధిలోని రామన్నపాలెం పంచాయతీ కొత్తూరువారిగూడెం అంగన్‌వాడీ సెంటర్‌లో కిశోరి వికాసంపై మంగళవారం వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. బాలల హక్కులు, పోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని జంగారెడ్డిగూడెం ఐసీడీఎస్ సీడీపీఓ పి.బ్యూలా వివరించారు. బాల్య వివాహాల నిరోధక చట్టం, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన చట్టం గురించి తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు వివరించారు. ఉప్పలపాడు జిఎంఎస్ కె.ఎం.భారతి, కామవరపుకోట సెక్టార్ సూపర్‌వైజర్ బి.మంగాదేవి, ఉప్పలపాడు సచివాలయ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్లు, ఆయాలు, ఆశా వర్కర్లు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

**భీమడోలు:** భీమడోలు ఐసీడీఎస్ పరిధిలోని గుండుగొలను తదితర గ్రామాల్లో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వేసవి సెలవులు సందర్భంగా జూన్ 10 తేదీ వరకూ కార్యక్రమాలు జరుగుతాయని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. మహిళలు, బాలల హక్కులు, వారి రక్షణ, పోక్సో చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో పద్మావతిదేవి పాల్గొన్నారు. గుండుగొలనులో జరిగిన కార్యక్రమానికి సూపర్‌వైజర్ కవిత, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

**పెదపాడు:** ఉచిత వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పెదపాడు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. రిసోర్స్‌పర్సన్, సచివాలయ మహిళా పోలీసు దివ్య బాలబాలికలు నేర్చుకోవాల్సిన మంచి అలవాట్లు, నడవడికపై వివరించారు. అనంతరం విద్యార్థులతో పుస్తక పఠనం చేయించినట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

**బుట్టాయగూడెం:** కిశోర బాలికలు పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో కె.జ్యోతి అన్నారు. బుట్టాయగూడెం 5వ అంగన్వాడీ కేంద్రంలో బాలల హక్కులు, పోక్సో చట్టంపై వివరించారు. బాలికలు లైంగిక వేధింపులకు గురైనా, మానసికంగా ఎవరన్నా వేధించినా చట్టాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మికం


బావిశెట్టివారిపేటలోని కనకదుర్గాంబ

ఏలూరు కార్పొరేషన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : దేవదాయశాఖ ఆధ్వర్యంలోని బావిశెట్టివారిపేటలో గల కనకదుర్గాంబ అమ్మవారి ఆలయంలో ఈ నెల 11 నుంచి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవ, పుష్పయాగ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. ముగింపు సందర్భంగా అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, హోమాలు, పూర్ణాహుతి, వసంతోత్సవం, పండిత సత్కారం జరిపారు. వేద పండితులతో మహదాశీర్వచనం నిర్వహించారు. ఆలయ యాజ్ఞిక బ్రహ్మ కందుర్తి గోపాలకృష్ణ, ఆలయ ప్రధాన అర్చకులు యడవల్లి శ్రీహరిశర్మ భక్తులతో పూజలు, హోమాలు, అర్చనలు జరిపించారు.

### ముగిసిన తిరునాళ్లు

**పెదవేగి:** మండల కేంద్రం పెదవేగిలో వేంచేసిన శ్రీకాలభైరవి అమ్మవారి తిరునాళ్లు మంగళవారంతో ముగిశాయి. అమ్మవారికి ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరునాళ్ల ముగింపును పురస్కరించుకుని మంగళవారం అమ్మవారి సన్నిధిలో అన్న సమారాధన నిర్వహించారు. పెదవేగి, లక్ష్మీపురం, సూర్యారావుపేట, గార్లమడుగు, సీతాపురం తదితర గ్రామాలనుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

### అన్నసమారాధన

**పెదపాడు:** పెదపాడు మండలం అప్పనవీడులోని ప్రసిద్ధ చెందిన అభయాంజనేయస్వామి ఆలయం వద్ద హనుమాన్ జంక్షన్‌కు చెందిన దాత తవ్వ పూర్ణచంద్రరావు ఆర్థిక సాయంతో సుమారు 200 మందికి అన్నదానం చేసినట్టు ఆలయ ఇవో పి.తారకేశ్వరరావు తెలిపారు. మంగళవారం కావడంతో పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.

### ఘనంగా ఆలయ వార్షికోత్సవం

**టి.నర్సాపురం:** టి.నర్సాపురంలో వేంచేసి ఉన్న శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆలయం వద్ద హనుమాన్‌చాలీసా పారాయణం చేశారు. అన్నసమారాధన జరిగింది.

### కల్యాణం.. కడు రమణీయం

**కామవరపుకోట:** గుంటుపల్లి కొండపై గల లక్ష్మీనారాయణస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పామర్తి వెంకన్నబాబు నిర్వహణలో నాగ శేషు, ఆదిశేషులు కల్యాణాన్ని జరిపించారు. వేముల సాయిబాబా దంపతులు పూజాదికాలు నిర్వహించారు. పామర్తి రామకోటేశ్వరరావు, సర్పంచ్ గోరింకదాసు, కంఠమనేని అంజిమూర్తి, బేతిన వెంకట్రావు పాల్గొన్నారు.



## టెన్త్ సీబీఎస్ఈలో మోక్షజ్ఞ ప్రతిభ



ఏలూరు క్రైం, మే 13 (ఆంధ్రజ్యోతి): సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో ఏలూరుకు చెందిన వై. మోక్షజ్ఞ ప్రతిభ కనబరిచాడు. ఏలూరు జిల్లా అదనపు సెషన్స్ జడ్జిగా పని చేస్తున్న డాక్టర్ వై. శ్రీనివాసరావు కుమారుడు మోక్షజ్ఞకు ఇంగ్లీషు 96, తెలుగు 80, గణితం 71, సామాజిక శాస్త్రం 82, సమాచార సాంకేతికత 86 మార్కులు సాధించి తన ప్రతిభ చాటాడు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే అత్యధిక మార్కులు సాధించినట్లుగా మోక్షజ్ఞ తెలిపాడు.

## స్వయం ఉపాధి రుణాల దరఖాస్తుకు గడువు పెంచాలి

జంగారెడ్డిగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ స్వయం ఉపాధి రుణాల దరఖాస్తుల గడువు పెంచాలని టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొల్లమండల శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల పదవ తేదీతో గడువు ముగిసిందని, సర్వర్లు సక్రమంగా పనిచేయక పలువురు లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోలేక పోయారన్నారు. ప్రభుత్వం మరికొద్ది రోజులు దరఖాస్తు చేసుకోవడానికి గడువు పెంచాలని కోరారు.

## విద్యుత్ పరికరాలు దగ్ధం

కామవరపుకోట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆడమిల్లిలో బంకు సమీపంలో గల పారేపల్లి వెంకటాచార్యులుకు చెందిన పామాయిల్ తోటలో ఉన్న బోరు మోటరు విద్యుత్ పరికరాలకు ఆగంతుకులు నిప్పంటించడంతో అవి దగ్ధమై రూ. 2 లక్షల నష్టం వాటిల్లింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ గూడపాటి కేశవరావు పోలీసులకు సమాచారం అందించడంతో తడికలపూడి ఎస్ఐ పి.చెన్నారావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అగ్నిప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు. ఆడమిల్లి పంచాయతీ కార్యదర్శి వి.రాజేష్, వీఆర్వో ముత్యం పాల్గొన్నారు.



## కవల దూడల జననం

జంగారెడ్డిగూడెం, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన రాజాన పండుకు చెందిన ఓ జెర్సీ ఆవుకు కవల దూడలు జన్మించాయి. వీటిని చూడటానికి పట్టణ ప్రజలు ఆసక్తి కనబరిచారు. 20 ఏళ్లుగా తాము ఆవులను పెంచుతున్నామని, కవల దూడల జననం ఇదే తొలిసారని ఆవు యజమాని రాజాన పండు హర్షం వ్యక్తం చేశారు.

## సమ్మెలో ఉపాధి కూలీలు పాల్గొనాలి

లింగపాలెం, మే 13(ఆంధ్రజ్యోతి): ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేయాలని పాలకవర్గాలు కుట్ర పన్నుతున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ ఆరోపించారు. మంగళవారం అయ్యప్పరాజుగూడెంలో జరుగుతున్న ఉపాధి పనులు పరిశీలించి మాట్లాడుతూ మే 20న జరిగే దేశవ్యాప్త బంద్‌ను విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు. రాష్ట్రకమిటీ సభ్యులు అప్పలస్వామితో కలసి బంద్ కరపత్రాలను ఆవిష్కరించారు. బంద్‌లో కార్మికులు, ఉపాధి కూలీలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఏజెన్సీ ప్రాంతాల్లో గిరిజనులకే ఉద్యోగాలు

బుట్టాయగూడెం, మే 13(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో స్థానిక గిరిజనులకే ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు ట్రైకార్ చైర్మన్, పోలవరం నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి బొరగం శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం సీఎం గిరిజన శాఖపై సమీక్ష నిర్వహించి ఇదే విషయాన్ని స్పష్టం చేశారన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలు, మార్గదర్శకాలు పాటిస్తూ గిరిజనులకు న్యాయం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రద్దు అయినా జీవో 3 స్థానంలో గిరిజనులకు మేలుచేసే నిర్ణయాలపై సీఎం అధ్యయనం చేస్తున్నారని తెలిపారు.

## బాధితులకు ఆర్థిక సాయం

కుక్కునూరు, మే 13(ఆంధ్రజ్యోతి): వింజరం పంచాయతీ బర్లమడుగులో మంగళవారం జరిగిన అగ్నిప్రమాదంలో రేసు రాజులు, సోయం బుల్లమ్మ ఇళ్లు దగ్ధమై కట్టుబట్టలతో మిగిలారు. ప్రమాదానికి కారణం తెలియరాలేదు. కుక్కునూరు నుంచి ఫైర్‌స్టేషన్ సిబ్బంది వచ్చి మంటలు ఆర్పివేశారు. టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి నాగేశ్వరరావు ఆ కుటుంబానికి రూ.4వేలు విలువ చేసే కూరగాయలు, నిత్యవసర సరుకులు అందజేశారు. రెవిన్యూ శాఖ నుంచి తాహసీల్దార్ రమేశ్‌బాబు ఒక్కో కుటుంబానికి 20 కేజీల బియ్యం అందజేశారు. వైస్ ఎంపీపీ తాండ్ర రాజేశ్ తక్షణ సాయం కింద రూ.5 వేలు అందజేశారు.

## తొమ్మిది నెలల్లో రూ.3 కోట్ల సీఎం రిలీఫ్ ఫండ్ విడుదల

నూజివీడు, మే 13 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లో నూజివీడు నియోజకవర్గంలో వైద్యం నిమిత్తం 332 మందికి సీఎం రిలీఫ్‌ఫండ్ నుంచి సుమారు రూ.3కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు మంత్రి కొలుసు పార్థసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఆధునిక వైద్యపరికరాలు, నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఈ సదుపాయాన్ని పేద ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైద్యం కోసం ఎమర్జెన్సీ సమయంలో నేరుగా నాతో మాట్లాడి, ప్రభుత్వం నుంచి మెరుగైన వైద్యసేవలు పొందాలని మంత్రి కోరారు.

## బైండోవర్ ఉల్లంఘన.. రూ.లక్ష జరిమానా

ఆగిరిపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆగిరిపల్లి గ్రామానికి చెందిన యందూరి అప్పారావు గతంలో సారా తయారీదారులకు బెల్లం సప్లై చేసినందుకు తహసీల్దార్ బైండోవర్ చేశారు. మరలా మంగళవారం సారా తయారీదారులకు బెల్లం సప్లై చేసి బైండోవర్ ఉల్లంఘించినందుకు రూ.లక్ష జరిమానాను ఆగిరిపల్లి తహసీల్దార్ వారు విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మస్తానయ్య తెలిపారు.

## ముగిసిన సోమేశ్వరస్వామి కల్యాణోత్సవాలు



ముదినేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం అల్లూరు గ్రామంలోని పార్వతి సమేత సోమేశ్వరస్వామి దేవస్థానంలో మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక కల్యాణ మహోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. దేవస్థానం కార్యనిర్వాహణాధికారి శింగనపల్లి శ్రీనివాసరావు, అర్చకులు ఐలూరి సుబ్రహ్మణ్యశర్మ, శేఖర్ కుంభ పూజలు జరిపి, మహాపూర్ణాహుతి నిర్వహించిన అనంతరం జరిగిన అన్నసమారాధనలో సుమారు మూడు వేల మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. తెలుగు యువత కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు దావు నాగరాజు, బీజేపీ నాయకురాలు దేవ్ రాధిక తదితరులు పాల్గొన్నారు.

## సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి భక్తుల తాకిడి

ముదినేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. దేవస్థానం వద్ద పుట్టలో పాలుపోసి, నాగ ప్రతిమలకు భక్తులు పూజలు నిర్వహించారు. పాల పొంగళ్లతో మహిళలు తమ మొక్కులను తీర్చుకున్నారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ రుద్రరాజు గంగా శ్రీదేవి ఆధ్వర్యంలో అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, రుద్రపాక బాలగంగాధర తిలక్ అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

## ఎక్సైజ్ నేరస్థుల బైండోవర్

నూజివీడు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాలకు మరోమారు పాల్పడితే ప్రభుత్వ పథకాలు నిలిపివేస్తామని నూజివీడు తహసీల్దార్ డి.బద్రు హెచ్చరించారు. మంగళవారం నూజివీడు ప్రొహిబిషన్ ఎక్సైజ్ స్టేషన్‌పరిధిలోని దేవరగుంట, ఓగిరాల తండా గ్రామాలకు చెందిన 21మంది పాత నేరస్తులను తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరలా ఎక్సైజ్ నేరాలకు పాల్పడితే లక్ష రూపాయలు జరిమానా వసూలు చేయడంతో పాటు ప్రభుత్వ పథకాలను రద్దు చేస్తామన్నారు. ఎక్సైజ్ సీఐ ఎమస్తానయ్య, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న పట్టణ సీఐ సత్యశ్రీనివాస్

## బాల్య వివాహాలపై నిఘా ఉంచండి

నూజివీడు టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి):బాల్య వివాహాలపై మహిళా శిశు సంక్షేమశాఖ సిబ్బంది నిఘా ఉంచి చర్యలు చేపట్టాలని నూజివీడు పట్టణ సీఐ సత్య శ్రీనివాస్ అన్నారు. మంగళవారం నూజివీడు పట్టణంలోని రామాయ మ్మరావుపేటలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో బాల్యవివాహాలు, బాలికలపై జరుగుతున్న నేరాలను అరికట్టే విషయమై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు తెలిసినా, లేదా మహిళల పై నేరాలు విషయంలో హెల్ప్‌లైన్ నెంబర్ 1098 లేదా 112 లేదా 181కు కాల్ చేయాలని సూచించారు.

## విద్యార్థుల పుస్తక పఠనం

ముదినేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం ముదినేపల్లిలోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులు పుస్తక పఠనం నిర్వహించారు. గ్రంథాలయాధికారిణి ఎం.శ్రీదేవి జాతీయ నాయకుల జీవిత విశేషాలకు సంబంధించిన పుస్తకాలను చదివించటంతోపాటు జనరల్ నాలెడ్జి పెంపొందించే పుస్తకాలను చదివించారు.

## ముదినేపల్లి - భీమవరం స్టేట్ హైవే రోడ్డుకు మోక్షం

### రూ.5.2 కోట్లతో రోడ్డుకు మరమ్మతులు

ముదినేపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి - భీమవరం (వయా సింగరాయపాలెం) స్టేట్ హైవేకు ఎట్టకేలకు మోక్షం కలిగింది. దశాబ్దాల తరబడి ఈ రహదారిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు నేటికి తీరాయి. 2014-19 సంవత్సరాల మధ్య టీడీపీ హయాంలో రహదారిలో జరిగిన ప్రత్యేక మరమ్మతుల పనులను తిరిగి ఇప్పుడు కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నిర్వహించారు. 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం ఈ రహదారి అభివృద్ధి పనులను నిర్వహించకపోవటంతో ఈ రోడ్డు మరింత అధ్వాన్నంగా తయారై వాహనాల రాకపోకలకు ప్రమాదకరంగా తయారైంది. అప్పట్లో ఈ రోడ్డు అభివృద్ధికి రూ.8 కోట్లు నిధులు మంజూరయ్యాయని ప్రచారం చేశారే కాని ఒక్క తట్టెడు మట్టి వేసిన పాపాన పోలేదు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ చొరవతో ఈ ప్రధాన రహదారి అభివృద్ధికి రూ.5.20 కోట్ల నిధులు మంజూరు చేయటంతో రోడ్డు అభివృద్ధి పనులను వేగంగా నిర్వహించారు. ముదినేపల్లి నుంచి సుమారు 28 కిలోమీటర్ల దూరం రోడ్డుకు మరమ్మతులు నిర్వహించి అభివృద్ధి చేశారు. ముదినేపల్లి, కలిదిండి మండలాలకు చెందిన సుమారు 30 గ్రామాల ప్రజలకు రోడ్డు సౌకర్యం మెరుగు పడింది.



## మే పుష్పాలు కనువిందు

ముసునూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): ముసునూరులో వేంపాడు మేజర్ మాజీ డీసీ చైర్మన్ తుమ్మల లక్ష్మణరావు ఇంటి వద్ద మే పుష్పాలు కనువిందు చేస్తున్నాయి. సుమారు 15 పుష్పాలు వికసించాయి. ప్రతి ఏటా మే నెలలో ఈ పుష్పాలు వికసించడం విశేషం. వివిధ రకాల పూల మొక్కలను ఆసక్తిగా పెంచడం లక్ష్మణరావు ప్రత్యేకత. ఇంటి ఆవరణ రకరకాల పూలతో కళకళలాడుతున్నది.

# మండుతున్న ఎండలు



నిర్మానుష్యంగా ఉన్న కైకలూరు బస్టాండ్ రోడ్డు

కైకలూరు, మే 13(ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరగడంతో ప్రజలు అల్లాడుతున్నారు. 40డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవడంతో ప్రజలు ఎక్కడికక్కడే ఉదయం 11గంటలకే ఇళ్లకు చేరడంతో రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే కైకలూరు తాలూకా సెంటర్లో జనసంచారం లేక రహదారి వెలవెలపోయింది. చలివేంద్రాల వద్దకు ప్రజలు పెద్దఎత్తున వెళ్లి దాహార్తిని తీర్చుకుంటున్నారు. కైకలూరు కోరుకొల్లు సెంటర్లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద, కైకలూరు వెలంపేట కలిసి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మజ్జిగ చలివేంద్రంలోను, ఏలూరురోడ్డు సెంటర్లో మానవత సేవాస్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద ప్రజలు దాహార్తిని తీర్చుకుంటున్నారు.

### కొల్లేరు పక్షుల విలవిల

ఉష్ణోగ్రతలు పెరగడంతో ఎండ వేడికి కొల్లేరు పక్షులు సైతం విలవిలలాడుతున్నాయి. కొల్లేరులో నీరు లేక అడుగంటిపోవడంతో పక్షులు చిన్నచిన్న నీటిగుంటల వద్ద దాహార్తిని తీర్చుకుని సేద తీరుతున్నాయి. స్వదేశీ, విదేశీ పక్షులు సైతం నీటి కోసం సుదీర్ఘ ప్రాంతాలకు తరలివెళుతున్నాయి. ఆటపాక పక్షుల కేంద్రంలో నీరు అడుగంటిపోవడంతో విదేశీ వలస పక్షులు కొల్లేరు సరస్సు సరిహద్దుల్లో ఉన్న నీటి గుంటలను, సమీపాన ఉన్న చేపల చెరువుల్లోకి వెళుతున్నాయి. దీంతో కొల్లేరులో నీరు లేకపోవడంతో మేత పుష్కలంగా లేక పక్షులు అల్లాడుతున్నాయి.





కొల్లేరు సరస్సులో చిన్నపాటి నీటిగుంటల్లో సేదతీరుతున్న పక్షులు... నిర్మానుష్యంగా ఉన్న కలిదిండి సెంటర్

**కలిదిండి:** కలిదిండిలో మంగళవారం 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావటంతో ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. సాయంత్రం 5 గంటల వరకు జనం రోడ్డుపైకి రాకపోవటంతో నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారి నిర్మానుష్యంగా మారింది. ప్రయాణికులు లేకపోవటంతో ఆర్టీసీ బస్సులు ఖాళీగా రాకపోకలు సాగించాయి. గోలి సోడాలు, కూల్ డ్రింక్స్ తాగుతూ దాహార్తిని తీర్చుకున్నారు. ఇప్పుడే ఈ విధంగా ఉంటే రోహిణి కార్తెలో ఎండలు ఇంకా ఎక్కువగా ఉంటాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.





చాట్రాయి, కలిదిండిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

## మట్టి పరీక్షలతో రైతులకు మేలు

చాట్రాయి, మే 13(ఆంధ్రజ్యోతి): మట్టి నమూనాల పరీక్షల ద్వారా రైతులకు మేలు జరుగుతుందని వ్యవసాయాధికారి శివశంకర్ అన్నారు. చాట్రాయిలో మంగళవారం రైతుసేవా కేంద్రం సిబ్బందితో కలిసి మట్టి నమూనాలు సేకరించారు. రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నమూనా రంగా ఉన్న ప్రదేశంలో ఒక ఎకరం భూమిలో నాలుగైదు చోట్ల ఒక కేజీ మట్టి సేకరించి నీడలో ఆరబెట్టి తరువాత మెత్తగా చెయ్యాలన్నారు. మట్టి నమూనాలు తీసేటప్పుడు 15 సెంటీ మీటర్ల లోతులో వి ఆకారంలో తీయాలన్నారు. మట్టి పరీక్షలు చేయించుకోవటం వలన తాము సాగు చేసే భూమిలో స్థూల మరియు సూక్ష్మ పోషకాలు సమపాళ్లలో ఉన్నాయో లేదో తెలుసుకొని, భూమికి సరిపడా ఎరువులు వాడుకోవటం ద్వారా ఎరువుల ఖర్చు తగ్గించుకోవచ్చునని అన్నారు. మండలంలో ఈ ఏడాది 1250 మట్టి నమూనాలు సేకరణ లక్ష్యమని తెలిపారు.

**కలిదిండి:** కోరుకొల్లు, సానారుద్రవరం, వెంకటాపురం, గోపాలపురం గ్రామాల్లో వ్యవసాయ అధికారులు మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ శాఖ అధికారి విద్యాసాగర్ మాట్లాడుతూ మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలు చేస్తున్నామన్నారు. భూసార పరీక్షలతో ఎరువులు తగు మోతాదులో వేసుకోవటం వల్ల రైతులకు పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు. సేంద్రియ ఎరువులతో భూసారం రం పెంపొందుతుందన్నారు. భూసార పరీక్షలు చేయించుకున్న రైతులకు జింక్, జిప్సంలు సబ్సిడీపై అందిస్తామన్నారు. రైతులు భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

**ఆగిరిపల్లి:** ఏలూరు జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా మంగళవారం ఆగిరిపల్లి మండలం వడ్లమాను రైతుసేవా కేంద్రం (ఆర్‌ఎస్‌కె)ను సందర్శించి ఆగిరిపల్లి మండల వ్యవసాయ అధికారి ఆధ్వర్యంలో రైతుసేవా కేంద్రాల ఇన్‌చార్జ్‌లకు సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలో భూసార పరీక్ష పలితాల కోసం మట్టి నమూనా సేకరణ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వల్లూరి చెన్నారావు, గ్రామ వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## మందు గుండు పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు

### రామవరంలో సంఘటన... క్షతగాత్రులు తమిళనాడు యువకులు

కైకలూరు, మే 13(ఆంధ్రజ్యోతి): అక్కా చెరువులపై పిట్టలను కొట్టేందుకు వినియోగించే మందుగుండు సామగ్రి పేలి ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి వారిలో ఒకరు బాలుడు ఉన్నాడు. కైకలూరు మండలం రామవరంలో మంగళవారం ఉదయం ఈ సంఘటన చోటు చేసుకుంది. 20రోజుల క్రితం తమిళనాడు రాష్ట్రానికి చెందిన కొంతమంది చేపల, రొయ్యల చెరువులపై పక్షులను బెదరకొట్టేందుకు కూలిపని చేసుకునేందుకు రామవరం గ్రామానికి వచ్చారు. ఆదే గ్రామంలో ఒక ఇంటిలో అద్దెకు ఉంటున్నారు. మణిసెల్వ్, కాంతప్ప మణి ఇరువురు ఇంటిలోని



చికిత్స పొందుతున్న పవన్‌చరణ్

నాటు తుపాకీకి వినియోగించే మందు కలుపుతుండగా ప్రమాదవశాత్తు పేలుడు సంభవించింది. ఆ సమయంలో అక్కడ నిద్రిస్తున్న పవన్‌చరణ్‌తో సహా ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. భారీగా పేలుడు శబ్దం వినిపించడంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. 108 ద్వారా వారిని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మణిసెల్వ్(36), కాంతప్ప మణి(24)లను ఏలూరులోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. తిరుపతి గ్రామానికి చెందిన పవన్‌చరణ్(15) కైకలూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ముగ్గురికి చేతులు, కాళ్లు, ముఖాలకు తీవ్రంగా గాయాలయ్యాయి. కైకలూరు రూరల్ ఎస్సై వి.రాంబాబు తుపాకీని స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.



జనార్దనవరంలో టీడీపీ ఎన్నిక ధ్రువపత్రం అందిస్తున్న పార్టీ పరిశీలకుడు

## రెండు గ్రామాలకు టీడీపీ గ్రామ కమిటీల ఎన్నిక

చాట్రాయి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని జనార్దనవరం, కోటపాడు గ్రామ టీడీపీ కమిటీలను మంగళవారం ఎన్నిక నిర్వహించారు. జనార్దనవరం గ్రామ టీడీపీ అధ్యక్షుడిగా మాదాసు చిన్న పుల్లయ్య ఉపాధ్యక్షుడిగా పామర్తి నాగరాజు, కార్యదర్శిగా బలుసుపాటి రత్తయ్య, జనరల్ సెక్రటరీగా కాసగాని గోపాలస్వామి ఎన్నికైనట్లు ప్రకటించారు. కోటపాడు గ్రామ టీడీపీ అధ్యక్షుడుగా పామర్తి రాజేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా అబ్బదాసరి సురేష్, ప్రధాన కార్యదర్శిగా బొంతు శ్రీనివాసరావు ఎన్నికైనట్లు ప్రకటించారు. పార్టీ పరిశీలకులు చెరుకూరి దుర్గాప్రసాద్, గద్దె రామూబులు, నాగు ఎన్నిక నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మంచిన పూర్ణచంద్రరావు, మాదాసు చంద్రశేఖర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రమణక్కపేట గ్రామ కమిటీ ఎంపిక పత్రాన్ని చూపుతున్న నాయకులు

## రమణక్కపేట టీడీపీ అధ్యక్షుడిగా శ్రీనివాస్

ముసునూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ కమిటీల ఎంపిక ప్రక్రియ వేగంగా జరుగుతోంది. మంగళవారం రమణక్కపేట గ్రామ కమిటీ ఎంపికను మండల పార్టీ అధ్యక్షుడు దేవినేని ధలరాం, పరిశీలకులు బొద్దు లక్ష్మణరావులు నిర్వహించారు. గ్రామ టీడీపీ నూతన అధ్యక్షుడిగా యువనేత రంగు శ్రీనివాసరావు(వాసు), ఉపాధ్యక్షుడిగా కంటి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా ఉప్పే శివనాగాంజనేయులతోపాటు మరో పదిమంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు దేవినేని తెలిపారు. బలివే గ్రామ టీడీపీ అధ్యక్షులుగా మరోసారి కాట్రు రామస్వామి ఎన్నికగా, ఉపాధ్యక్షులుగా జక్కుల వెంకట రమణ, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు దేవినేని తెలిపారు.

### బ్రాయిలర్ ధరలు



| అమరావతి | (కిలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 125, 134, 145 |
| చికెన్ విత్ స్కిన్ | 240 |
| చికెన్ స్కిన్‌లెస్ | 250 |

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475



అవగాహన కల్పిస్తున్న జిల్లా ప్రాజెక్టు అధికారిణి పి. శారద

## అపరిచిత వ్యక్తుల పట్ల జాగ్రత్తగా ఉండాలి

కైకలూరు,మే13 (ఆంధ్రజ్యోతి): కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి.శారద అన్నారు. మంగళవారం కైకలూరు శివారు దానగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం 2.0 కార్యక్రమంలో భాగంగా వేసవి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రాజెక్టు ఆఫీసర్ మాట్లాడుతూ యుక్తవయస్సులో ప్రవేశించే బాలికలు స్వేచ్ఛకు భంగం కలుగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. విహహ వయస్సు రాకుండా బాల్య వివాహాలు చేస్తే చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. శరీరంలో కలుగుతున్న మార్పులను, సమాజంలో ఏ విధంగా మెలగాలనే విషయాలు బోధించారు. ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలుసుకోవాలని సూచించారు. సోషల్ మీడియా, అపరిచిత వ్యక్తుల పరిచయాలు, సైబర్ నేరాలపై అవగాహనపెంచి, సెల్‌ఫోన్ వాడకం తగ్గించాలన్నారు. పాఠ్యపుస్తకాలతో పాటు పుస్తక పఠనం చేయాలన్నారు. కార్యక్రమంలో కైకలూరు సీడీపీవో డాక్టర్ వి. దీప్తి, ఏఎస్ఐ వై. రజనీకుమారి, మహిళా పోలీస్ వి.భార్గవి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.కృష్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్. భాగ్యలక్ష్మి, ఏ. సుగుణ, ఎస్. కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

ఆగిరిపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి):దళితుల భూములను ఆక్రమించుకున్న పెత్తందారులపై చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు అసైన్డ్ చట్టం ప్రకారం దళితుల భూములను వారికే కేటాయించాలని సీపీఎం కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. మంగళవారం నాడు మండల పరిధిలోని తోటపల్లి గ్రామంలో జల్లేల చిన్న ఆగిరిపల్లిలో దళితులు స్వాధీన ఉద్యమం చేస్తున్న భూములను ఆయన భూపోరాట కమిటీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కష్టజీవులకు ఎప్పుడు ఎర్రజెండా అండగా ఉంటుందని ఈ భూపోరాటానికి సీపీఎం పూర్తి సంఘీభావం తెలుపుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జిరాజు, నత్తు కోటేశ్వరరావు, నరేష్, రంగారావు, కుమారి, వాణి, అరుణ, అర్జునరావు, సుబ్బారావు, రామ్మోహనరావు, సుబ్రాయుడు, సుర్తిలు పాల్గొన్నారు.

## కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

కలిదిండి, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 20న జరుగుతున్న కార్మిక ఉద్యోగుల సమ్మెను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మూల్లంకలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సమ్మె వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులను యజమానులకు బానిసలుగా మార్చే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, సీఐటీయూ మండల కార్యదర్శి జక్కుల మహేష్, నాయకులు జక్కంశెట్టి మేనకా లక్ష్మీ, జీఏస్ప, దానమ్మ పాల్గొన్నారు.

## ఉపాధి పనుల పరిశీలన



పర్వతాపురంలో పని ప్రదేశంలో మస్టర్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో

చాట్రాయి, మే 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదల జీవనోపాధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో విజయలక్ష్మి కోరారు. మండలంలోని పర్వతాపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఆమె పరిశీలించారు. పని ప్రదేశంలో నీడ కోసం టెంట్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు తదితర సదుపాయాలు అందుతున్నాయా అని ఆమె ప్రశ్నించగా కూలీలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఉదయం 6 గంటలకు పనులకు వచ్చి 11 గంటల వరకు పనులు చేసి ఇళ్లకు వెళ్లి పోవచ్చునని మధ్యలో అర గంట విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. టీసీ చంద్రమోహన్, ఎఫ్ఏ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ముసునూరు:** ఉపాధి పనుల్లో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎంపీడీవో బీపీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం సూరేపల్లిలో జరుగుతున్న ఉపాధిపనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల్లో నాణ్యత, కూలీల మస్టర్ రికార్డులను పరిశీలించి, కూలీలకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఎంపీడీవో మాట్లాడుతూ జాబ్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి పని కల్పించాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కూలీల మస్టర్లను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేసి, వేతనాలను సకాలం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో రోజలీనా, సీనియర్ అసిస్టెంట్ ఎస్.శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## అమర జవాన్‌కు నివాళులు

చాట్రాయి, మే 13(ఆంధ్రజ్యోతి): భారత్-పాక్ యుద్ధంలో వీర మరణం పొందిన అమర సైనికుడు మురళీ నాయక్‌కు సోమవారం రాత్రి పోతనపల్లి గ్రామస్థులు కొవ్వొత్తులతో నివాళులు అర్పించారు. దేశ రక్షణ కోసం ప్రాణాలు అర్పించిన మురళీ నాయక్‌ను దేశ ప్రజలు ఎప్పటికీ గుర్తుంచుకుంటారని పలువురు అన్నారు. కార్యక్రమంలో ఏపీ గిరిజన సంక్షేమ సంఘం జిల్లా నాయకులు డి మంగ్యా, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలతో అనర్థాలు

చాట్రాయి, మే 13(ఆంధ్రజ్యోతి): చాట్రాయి ఎమ్మార్వో ఆఫీస్ రోడ్డు అంగన్‌వాడీ కేంద్రంలో బాల్య వివాహాల వలన అనర్థాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. పోషకాహారం ఆవశ్యకత, పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణ, చట్టాలు గురించి ఎంఎల్‌ చంద్రకళ వివరించారు.

## రోడ్డు ప్రమాదంలో నీటి సంఘం అధ్యక్షుడి మృతి



చిన్నం కృష్ణ (ఫైల్)

చాట్రాయి, మే 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేట మోగల్ చెరువు నీటి సంఘం అధ్యక్షుడు చిన్నం కృష్ణ(55) సోమవారం రాత్రి భీమడోలు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందారు. అన్నవరంలో జరిగిన బంధువుల వివాహానికి కారులో వెళ్ళి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. మృతునకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. చిన్నం కృష్ణ మృతితో చిన్నంపేటలో విషాదఛాయలు అలుముకున్నాయి. జిల్లా టీడీపీ లీగల్ సెల్ కార్యదర్శి అత్తులూరి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు చిన్నం కృష్ణ భౌతికకాయానికి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

## సీబీఎస్ఈలో కుమార్ విద్యార్థుల ప్రతిభ



దాసరి వెంకట సుబ్బారావు విశాంత్.. తవ్వా మోహన కృష్ణ

నూజివీడు/ఆగిరిపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం మంగళవారం విడుదల చేసిన సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో నూజివీడులోని కుమార్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారు. దాసరి వెంకట సుబ్బారావు విశాంత్ (483), కొణాల సుహాసిని 476 మార్కులు సాధించినట్లు తెలిపారు. తవ్వా మోహనకృష్ణ అనిరుధ్ (471), యాదల తేజేష్ (461) మార్కులు సాధించారు.

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కొరకు సంప్రదించాల్సిన నెంబర్లు
నూజివీడు : 99854 02464
కైకలూరు : 99854 11868
ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
సర్క్యులేషన్ మేనేజర్ 9985411604.
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234